
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
శనివారం 28 జూన్ 2025 | 5






శ్రీ జగన్నా

కన్నులపండువగా జగన్నాథుడి రథయాత్ర

జగన్నాథుడి రథయాత్ర శుక్రవారం అంగరంగ వైభవంగా సాగింది.. ఎక్కడికక్కడ భక్తులు హారతులు పట్టగా స్వామి రథం ముందుకు సాగింది.. రాజమహేంద్రవరం ఇస్కాన్ మందిరం నుంచి దేవిచౌక్ మీదుగా ర్యాలీ సాగింది. రథయాత్ర సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. -7లో



అవినీతి ఆరంభం : కాకినాడ జిల్లా కొమరగిరిలో జగనన్న ఆరంభించిన లేఅవుట్

నేతలు.. మహా మేతలు!

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

నేతలు.. మేతలు.. పేదల ఇళ్ల స్థలాల ముసుగులో గత వైసీపీ ప్రభుత్వంలో కొందరు నేతలు, అధికారులు ఒకటి కాదు రెండు కాదు.. వందల కోట్లు మెక్కేశారు. అంచనాలు అడ్డంగా పెంచేసి.. కోట్లలో బిల్లులు నొక్కేసి ఖజానాకు పంగనామాలు పెట్టారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 1600 లేఅవుట్లలో సుమారు 19 వేల ఇళ్ల స్థలాల కేటాయింపు, ఇతర విషయాలలో అవకతవకలు జరిగినట్టు అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. ప్రభుత్వం ఇప్పుడు అవినీతి డొంక కదల్చడానికి నేరుగా రంగంలోకి దిగింది. డ్వామా ఏపీడీలు, రాజధాని నుంచి పంపిన నరేగా క్వాలిటీ కంట్రోల్ అధికారులతో కలిసి ప్రత్యేక బృందాలతో వేట మొదలుపెట్టింది.

కాకినాడలో 324 లేఅవుట్లు..

కాకినాడ జిల్లాలో గత వైసీపీ ప్రభుత్వం 3,84,218 మంది లబ్ధిదారులను ఇళ్ల స్థలాలకు గుర్తించింది. 7,218 ఎకరాలు కావాల్సి ఉండగా 1,856 ఎకరాల ప్రభుత్వ భూమిపోను 5,362 ఎకరాలను రూ.2,566 కోట్లతో రైతుల నుంచి కొనుగోలుచేసింది. 2020 డిసెంబరు 25న అప్పటి సీఎం జగన్ కొమరగిరి వచ్చి తొలిసారిగా ఇళ్ల స్థలాల పథకం ప్రారంభించారు. అలాగే జిల్లావ్యాప్తంగా 324 లేఅవుట్లలో పేదలకు స్థలాలు కేటాయించారు. ప్రభుత్వం మారగానే జగనన్న లేఅవుట్లలో అక్రమాలపై విజిలెన్స్ అధికారులు దృష్టిపెట్టారు. 80 శాతం లేఅవుట్లలో భారీ అవినీతి జరిగిందని నిర్ధారించారు. కాకినాడ జిల్లాలో రూ.321 కోట్ల రెట్టింపు అంచనాలతో 152 లేఅవుట్లలో చేసిన పనులపై విచారణకు ఆదేశించింది. మరో 121 లేఅవుట్లలో పెండింగ్‌లో ఉన్న రూ.42 కోట్ల బిల్లుల అవినీతిపైనా దృష్టి పెట్టింది. 324 లేఅవుట్లలో చదును చేసిన రూ.650 కోట్ల బిల్లుల లెక్క తేల్చబోతోంది.

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

తూర్పుగోదావరి జిల్లాలోనూ పేదల ఇళ్ల స్థలాల పేరుతో కోట్లలో మెక్కేశారు. అవినీతి లెక్కతేల్చడానికి రాజమండ్రి రీజియన్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ స్నేహిత ఆధ్వర్యంలో అధికారులు రంగంలోకి దిగారు. ఈ మేరకు 4 బృందాలు ఏర్పాటుచేశారు. 324 లేఅవుట్లకు సంబంధించి రూ.6.6 కోట్లు అవకతవకలు జరిగినట్టు నిర్ధారించారు. రెట్టింపు అంచనాలకు సంబంధించి 7 మండలాల్లో 22 కోట్లు అవకతవకలు జరిగినట్టు తేల్చారు. లోతట్టు ప్రాంతాల్లో నిబంధనల మేరకు ఫిల్లింగ్ చేయకుండా వదిలేసిన కొన్ని ఇళ్లను గుర్తించారు. ఇళ్ల స్థలాల కోసం కొనుగోలు చేసిన భూముల్లో జరిగిన అవకతవకలపై విచారణ చేస్తున్నారు.

తూర్పున మెక్కేశారు!

కోరుకొండ మండలం బూరుగుపూడి, మధురపూడి తదితర ప్రాంతాల్లో పనికిరాని ఆవ భూములకు ఎకరానికి రూ.43 లక్షల వంతున చెల్లించి అవకతవకలకు పాల్పడిన సంగతి తెలిసిందే. దీనిపైనా విచారణ జరుగుతోంది. ఆవ భూమిలో సుమారు 6 మీటర్ల లోతు వరకూ నీరు నిలిచిపోతుందని.. ఇది నివాస యోగ్యం కాదని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. అసలు రైతుకు ఎంత ఇచ్చారు. అప్పట్లో అక్కడ మార్కెట్ విలువ ఎంత? ఎంత ఎక్కువ చెల్లించారు. ఎవరెవరి ప్రమేయం ఇందులో ఉందనే తదితర అంశాలపై నిశితంగా విజిలెన్స్ అధికారులు ఆరా తీస్తున్నారు. త్వరలో అవకతవకల నిగ్గుతేల్చి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నారు.

అతి పెద్ద స్కామ్ ఇక్కడే..

అతిపెద్ద స్కాం కొమరగిరి లేఅవుట్‌లోనే ఉన్నట్టు విజిలెన్స్ నిర్ధారించింది. అప్పట్లో సీఎం జగన్ ఇక్కడి నుంచి పేదల ఇళ్ల పథకం ప్రారంభించడంతో లోతట్టుగా ఉన్న 350 ఎకరాల కొమరగిరి భూములు చదునుకు రూ.125 కోట్ల వరకు వెచ్చించింది. ఈ పనులు అప్పటి కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చేశారు. గ్రావెల్‌ను పోలవరం కాలువలు, పెద్దాపురం రామేశంమెట్ట నుంచి తరలించేశారు. అధికారులేమో అడ్డగోలుగా రూ.35 కోట్ల వరకు బిల్లులు ఇచ్చేశారు. దీనిపై అప్పట్లో ముఖ్యమంత్రి అదనపు కార్యదర్శి రేవు ముత్యాల రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. లేఅవుట్ చదునుకు ఎకరాకు కనీసం రూ.15 లక్షల్లోపు చేయాల్సి ఉన్నా రెట్టింపు బిల్లులు ఇవ్వడంపై అనుమానాలు వ్యక్తం చేసినా చర్యల జోలికి వెళ్లలేదు. విచారణ బృందాలు ఈ అక్రమాలు తవ్వనున్నాయి.

పేదల ముసుగు..పెద్దల లొసుగు

- జగనన్న లేఅవుట్లలో భారీ అవినీతి
- ప్రత్యేక బృందాలతో విచారణ
- అడ్డగోలు చెల్లింపులపై ఆరా
- రూ.70 కోట్లు బిల్లుల పెండింగ్
- వేట ఆరంభించిన ప్రభుత్వం
- లేఅవుట్లలో 80 శాతం అక్రమాలే
- వెలుగు చూస్తున్న వైనం

డొంకంతా కదలాల్సిందే..

విజిలెన్స్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) అధికారులు పంపిన నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రత్యేక బృందాలను నియమించింది. అక్రమాలు భారీగా ఉన్న లేఅవుట్లలో ఎంతమేర నిధులు మెక్కేశారో తేల్చాలని నిర్ణయించింది. విచారణను రెండు భాగాలుగా విభజించింది. తొలి భాగం కింద జరిగిన పనుల పెండింగ్ బిల్లులకు సంబంధించి అక్రమాలపై విచారణ చేపడతారు. ఈ తరహా జిల్లాలో 121 లేఅవుట్లను గుర్తించారు. చదును, రహదారులు, డ్రైన్లు, మంచినీరు తదితర పనులకు రూ.120 కోట్ల వరకు ఇదివరకే చెల్లించగా ఇంకా రూ.42 కోట్లు బాకీలు చూపిస్తున్నారు. ఆయా లేఅవుట్లను తనిఖీ చేస్తున్నారు. రెండో అవినీతి కింద అనేక లేఅవుట్లలో అవసరం లేకున్నా ఒక్కో లేఅవుట్‌లో రూ.5 నుంచి రూ.10 కోట్ల వరకు కాకిలెక్కలతో బిల్లులు చేసుకుని డబ్బులు కాజేశారు. జిల్లాలో 17 మండలాల్లో 152 లేఅవుట్లకు రూ.321 కోట్ల వరకు వ్యయ అంచనాలు చూపించారు. ఎకరాకు రూ.25 లక్షలకుపైగా చదును బిల్లులు చూపించి కోట్లలో డబ్బులు కొట్టేశారు. ఒక్క కాకినాడ జిల్లాలోనే 324 లేఅవుట్లలో చదునుకు సంబంధించి రూ.650 కోట్ల వరకు బిల్లులు అప్పట్లో చెల్లించగా ఇందులో రూ.220 కోట్ల వరకు తప్పుడు బిల్లులే ఉన్నట్టు ప్రభుత్వం అనుమానిస్తోంది.

కోనసీమలోనూ..కుమ్ముడే

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వంలో పేదలకు ఇళ్ల నిర్మాణం పేరుతో వేసిన లేఅవుట్లలో ఫిల్లింగ్ అక్రమాలపై ప్రభుత్వం విచారణ చేపట్టింది. జిల్లాలోని నీటి యాజమాన్య సంస్థకు చెందిన ముగ్గురు ఏపీడీలు, అమరావతి నుంచి వచ్చే నరేగా క్వాలిటీ కంట్రోల్ టీమ్ సభ్యులతో మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా 111 లేఅవుట్లలో 241 పనులకు సంబంధించి రూ.21 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్టు సమాచారం. వీటితోపాటు గతంలో చేసిన, చేయని పనులకు కూడా భారీగా నిధులు డ్రా చేశారనే ఆరోపణలున్నాయి. ఈ మేరకు టీడీపీ కూటమి ప్రభుత్వం పెండింగ్ బిల్లులకు సంబంధించిన పనులను పర్యవేక్షించేందుకు క్వాలిటీ కంట్రోల్ టీమ్‌లు రంగంలోకి దింపింది. ఈ టీమ్‌లు గత ప్రభుత్వ హయాంలో జరిగిన పనులను పరిశీలించి ప్రభుత్వానికి నివేదికలు ఇవ్వనున్నాయి. పెండింగ్ బిల్లులతోపాటు గతంలో కాలనీల్లో జరిగిన అక్రమాలపై ఈ బృందం విచారణ జరుపుతున్నట్టు సమాచారం.

4న జేఎన్టీయూకే 11వ స్నాతకోత్సవం 6
డిగ్రీ అడ్మిషన్లు ఎప్పుడో! ఎటూ తేల్చని ప్రభుత్వం 7



చిన్నారులు.. గ్రాడ్యుయేట్లు!

అంగన్వాడీ చిన్నారుల గ్రాడ్యుయేషన్ గురించి ఎప్పుడైనా విన్నారా.. వినడమెందుకు ఇదిగో చూడండి.. రాజమహేంద్రవరంలో శుక్రవారం అంగన్వాడీ చిన్నారుల గ్రాడ్యుయేషన్ జరిగింది. అంగన్వాడీ ముగించుకుని ఒకటవ తరగతిలో చదువుకునేందుకు వెళుతున్న చిన్నారులకు ఎంపీ.పురందేశ్వరి, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, కలెక్టర్ ప్రశాంతి, ఇతర అధికారుల సమక్షంలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమం ఆకట్టుకుంది. - రాజమహేంద్రవరం అర్బన్



విజయవాడలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన అనపర్తి వైసీపీ ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు

అనపర్తిలో వైసీపీకి షాక్

- టీడీపీలోకి ఎంపీపీ, వైస్ ఎంపీపీ
- అదే బాటలో నలుగురు ఎంపీటీసీలు
- పార్టీలోకి ఆహ్వానించిన పల్లా

అనపర్తి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : అనపర్తిలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. వైసీపీ ఎంపీపీ, వైస్ ఎంపీపీ, నలుగురు ఎంపీటీసీలు శుక్రవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. విజయవాడ కుంచనపల్లిలోని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అనపర్తి వైసీపీకి చెందిన ఎంపీపీ అనసూరి సూర్యనారాయణ(బుజ్జి), ఎంపీటీసీ పద్మావతి, కుతుకులూరు ఎంపీటీసీ, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పులగం బులిరెడ్డి, రామవరం ఎంపీటీసీలు నల్లమిల్లి భాగ్యలక్ష్మి, గొలుగూరి గౌతమి, పెడపర్తి ఎంపీటీసీ తమలంపూడి మణిలకు రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై టీడీపీలో చేరామన్నారు. వీరి వెంట సత్తి దేవదానరెడ్డి, తేనెల శ్రీనివాస్, కర్రి చిన్నారెడ్డి, నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, తిరుమలరెడ్డి తదితరులు ఉన్నారు.

'తల్లికి వందనం'పై ఆందోళన వద్దు

9,361 అర్జీలకు పరిష్కారం : కలెక్టర్

రాజమహేంద్రవరం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : 'తల్లికి వందనం' పథకం నగదు జమ కాని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం 'తల్లికి వందనం' పథకంపై సమీక్షించారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో అర్జీలు ఇస్తే వాటిని పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ అందిన అర్జీల్లో 9,361 పరిష్కరించి 2865 మందికి నగదు చెల్లింపు కూడా చేశామన్నారు. మరో 6496 మందికి త్వరలోనే చెల్లింపులు ఉంటాయన్నారు. నవశకం పోర్టల్ మార్గదర్శకాలను అనుసరించి ఇంకా 6,431 అర్జీలు పరిశీలనలో ఉన్నాయన్నారు. పథకానికి ఎంపిక కానివారు గ్రామ, వార్డు సచివాలయాల్లో సరైన ధృవ పత్రాలు సమర్పించి అర్జీలు ఇస్తే ప్రభుత్వ వెబ్ పోర్టల్ కూడా సరిచేస్తామని చెప్పారు.



శాప్ డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్‌కు సన్మానం చేస్తున్న మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డి, ఎంపీ కేశినేని చిన్ని

శాప్ డైరెక్టర్ రవీంద్రనాథ్ ప్రమాణ స్వీకారం

దేవరపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర శాప్ డైరెక్టర్‌గా పేరం రవీంద్రనాథ్ శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. దేవరపల్లి గ్రామానికి చెందిన రవీంద్రనాథ్ రామన్నపాలెం ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర శాప్ డైరెక్టర్‌గా నియమిస్తూ గతంలోనే ఉత్తర్వులిచ్చింది. రవీంద్రనాథ్‌ను క్రీడాశాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని సత్కరించారు. రవీంద్రనాథ్ గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో శాప్ డైరెక్టర్‌గా విధులు నిర్వహించారు. ఎందరో విద్యార్థులను జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దారు. రెండో సారి శాప్ డైరెక్టర్‌గా అవకాశమిచ్చిన సీఎం చంద్రబాబు , కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ ఏడాది చివరికి టిడ్కో గృహాలిస్తాం



టిడ్కో చైర్మన్ అజయ్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు

- గృహాలకు వైసీపీ హయాంలో డ్యామేజ్
- బాగు చేయించడానికే రూ.4 వేల కోట్లు
- టిడ్కో చైర్మన్ అజయ్‌కుమార్

కొవ్వూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది చివరి నాటికి లక్ష టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ తెలిపారు. అన్నవరం వెళుతూ మార్గమధ్యంలో మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు నివాసానికి వెళ్లారు. వైసీపీ ప్రభుత్వం టిడ్కో గృహాలకు చేసిన డ్యామేజీ సంవత్సరంలో పూరించేది కాదన్నారు. టిడ్కో లబ్ధిదారుల పేరు మీద తీసుకున్న రుణాలకు సంబంధించి 2025 మే 31 వరకు బ్యాంకులకు చెల్లించాల్సిన ఇన్‌స్టాల్‌మెంట్స్ బకాయిలు జూన్ నెలాఖరు నాటికి దశలవారీగా రూ.185 కోట్లు ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. ఇటీవల కాకినాడ కలెక్టర్ జిల్లాకు సంబంధించి మొత్తం చెల్లించామని తెలియజేశారన్నారు. లబ్ధిదారులకు ఈ ఏడాదిలోనే గృహాలను అప్పగించాలని ఆలోచన చేస్తున్నామన్నారు. ముందుగా 365, 430 చదరపు అడుగుల గృహాలను ఇస్తామన్నారు. ఒక్కొక్క ఇంటికి రూ.60 వేల నుంచి రూ.70 వేలు మళ్లీ అదనంగా ఖర్చు చేయాల్సి వస్తుందన్నారు. సుమారు రూ.4 వేల కోట్లు ఖర్చవుతుందన్నారు. ఇప్పటికి ప్రభుత్వం రూ.16,250 కోట్లు ఖర్చు చేసిందన్నారు. అంత ఖర్చుచేసిన గృహాలను గత ఐదేళ్ల నిరుపయోగంగా వదిలేయడం బాధాకరమన్నారు. గతంలో టిడ్కో గృహం మంజూరై ప్రస్తుతం వయసు పరిమితి దాటిన వారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా (కో అప్లికెంట్) వారి పిల్లలకు ఇల్లు అందించేలా ఇప్పటికే ప్రభుత్వం జీవో విడుదల చేసిందన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి జనసేనాని పవన్ కల్యాణ్ అవిరళ కృషే కారణమన్నారు.పదవులు రాలేదని పార్టీ నుంచి బయటకు వెళ్లిన వారు చరిత్రహీనులుగా మిగిలిపోతారన్నారు. రెండు నెలల్లో పార్టీ కమిటీలు నియమించడం జరుగుతుందన్నారు.స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్న తరుణంలో పార్టీని మరింత బలోపేతం చేసుకోవాలన్నారు.కార్యక్రమంలో జనసేన కొవ్వూరు ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే టి.వి. రామారావు, నామాన బూరయ్య, సిద్ధా రామకృష్ణ, కల్లూరి సుబ్రహ్మణ్యం, చేవ్వూరి రాము, రాగు వీర్రాజు, బోడెం వెంకట సుబ్రహ్మణ్యశర్మ, విజయభాస్కర్, తాతారావు, ఊలపల్లి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అనాథల సంక్షేమానికే పీఎం కేర్ పథకం



పీఎం కేర్ అందుకుని మాట్లాడుతున్న సుమామణి

- వివాహిత సుమామణికి తొలి సాయం
- రూ.10 లక్షల చెక్ అందజేసిన ఎంపీ

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : కొవిడ్ సమయంలో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మిగిలిన పిల్లల సంక్షేమానికి ప్రధాని మోదీ పీఎం కేర్ పథకాన్ని ప్రవేశపెట్టారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. రాజమహేంద్రవరం పోలీస్ కన్వెన్షన్ హాలులో శుక్రవారం ఐసీడీఎస్ నిర్వహించిన కార్యక్రమంలో దేశంలోనే మొట్టమొదటి పీఎం కేర్ ఆర్థిక సహాయం రూ.10 లక్షల చెక్కును బొబ్బిల్లంకకు చెందిన ఎస్.సుమామణికి అందజేశారు. కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామానికి చెందిన సుమామణి తల్లిదండ్రులు మృత్యువాతపడ్డారు. దీంతో అనాథగా మిగిలింది. అనంతరం సీతానగరం మండలం బొబ్బిల్లంకకు చెందిన యువకుడిని వివాహం చేసుకుని అక్కడే నివసిస్తున్నారు.ఆమె పీఎం కేర్ పథకానికి ఎంపిక కాగా శుక్రవారం ఎంపీ పురందేశ్వరి రూ.10 లక్షల చెక్ అందజేసి మాట్లాడారు. మానవసేవే మాధవసేవ అనే సూక్తికి ఉదాహరణ పీఎం కేర్ పథకం అన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ పీఎం కేర్ గొప్ప పథకమని అన్నారు.ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ కొవిడ్ బాధితులకు పీఎం కేర్ అందించడం అభినందనీయమన్నారు.కార్యక్రమంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు, కలెక్టర్ ప్రశాంతి,ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, అర్బన్ సీడీపీవో నర్సమ్మ, కూటమి నాయకులు పాల్గొన్నారు.



కాకినాడలోని ఓ మినీ థియేటర్

నగరాల్లో కొత్త ట్రెండ్ నడుస్తోంది. ఒకప్పుడు పెద్ద పెద్ద ఫంక్షన్ హాళ్లలో జరిగే పలు వేడుకలు నేడు మినీ థియేటర్లలో జరిగిపోతున్నాయి. అతి కొద్దిమంది కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులను ఆహ్వానించి సింపుల్‌గా కానిచ్చేస్తున్నారు. అందుకోసం మినీ థియేటర్లను ఆశ్రయిస్తున్నారు. ఖర్చులు తగ్గించుకునే పనిలో పడ్డారు.

ఆనందం

'మినీ'మమ్ గ్యారంటీ...

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

నగరాలు, పట్టణాల్లో నివసిస్తున్న వారికి జన్మదినాలు, వివాహ వార్షికోత్సవాలు, ఇతరత్రా పార్టీలు జరుపుకోవాలన్న కోరిక ఎక్కువగా ఉంటుంది. ఫంక్షన్ హాలు బుక్ చేసుకుని అతిథులను పిలిచి చేసుకోవాలంటే ఖర్చు తడిసిమోపెడవుతుంది. ఒకవేళ రెస్టారెంట్‌కు వెళ్లినా అక్కడ డైనింగ్ టేబుల్‌పై కేవలం కేక్ కటింగ్‌కు మాత్రమే అనుమతిస్తారు. ఇంట్లో చేసుకోవాలంటే డెకరేషన్‌కు చాలా ఖర్చవుతుంది. ఈ గ్యాప్‌ను కవర్ చేసేందుకు కాకినాడ నగరంలో కొంతమంది మినీ థియేటర్స్ అందుబాటులోకి తీసుకొచ్చారు. నగరంలో పలుచోట్ల వీటిని ఏర్పాటుచేసి అద్దెకు ఇస్తున్నారు. పుట్టినరోజు వేడుకలు, వివాహ వార్షికోత్సవాలు, ఫ్రెండ్స్, కుటుంబ సభ్యులతో సరదాగా కాసేపు ఎంజాయ్ చేసే కార్యక్రమాలకు వీటిని ఇస్తున్నారు. రూ.3వేలు ఖర్చు చేస్తే సరిపోతుంది. నలుగురు సభ్యులకు రూ.2,500, ఆ తర్వాత ప్రతి అదనపు కుటుంబసభ్యుడికి రూ.250 చెప్పున చార్జ్ చేస్తారు. కాకినాడలోని మెయిన్‌రోడ్డు, జగన్నాథపురం, సినిమారోడ్డు, జేఎన్టీయూకే ఎదురుగా ఉన్న వీధి.. ఇలా పలుచోట్ల ఈ మినీ థియేటర్లను ఏర్పాటు చేశారు. చిన్నచిన్న పార్టీలు, ఫంక్షన్ల నిర్వహణకు ఇవి సిద్ధంగా ఉన్నాయి.

అడ్వాన్స్ బుకింగ్ చేసుకునేలా..

ఈ మినీ థియేటర్లను అడ్వాన్స్ బుకింగ్ చేసుకోవచ్చు. కోరుకున్న ఫుడ్ ఐటెంలను తయారు చేసుకుని తీసుకువెళ్లవచ్చు. ఫుడ్ డెలివరీ సంస్థలకు ఆర్డర్లు పెట్టుకోవచ్చు. మినీ థియేటర్ల యాజమాన్యాలకు చెప్పినా వాళ్లు తెప్పించి బిల్లులో వాటిని జత చేస్తారు.

- నగరాల్లో 'నయా' ట్రెండ్
- పెద్ద పెద్ద ఫంక్షన్ హాళ్లకు కాస్త బ్రేక్
- మినీ థియేటర్లను ఆశ్రయిస్తున్న జనం
- తక్కువ ఖర్చు, అదనపు సౌకర్యాలు
- ఇవే వీటి ప్రత్యేకత

థియేటర్‌ను తలదన్నేలా..

మినీ థియేటర్‌లోకి అడుగు పెడుతూనే ప్రజలు కొత్త అనుభూతి పొందుతున్నారు. లోపల పెద్ద థియేటర్ స్ర్కీన్, డాల్బీ సౌండ్ సిస్టం ఏర్పాటు చేసి ఉంటుంది. స్ర్కీన్ సైజులు 135 నుంచి 180 అంగుళాలు, సౌండ్ 600 వాట్స్ నుంచి వెయ్యి వాట్స్ వరకు ఉంటున్నాయి. ఫాగ్ ఎంట్రీలు కూడా కొన్ని థియేటర్లలో ఉంటున్నాయి. ఫొటో షూట్ కావాలన్నా ఏర్పాటు చేస్తున్నారు. లోపల సినిమా సెట్‌ను తలదన్నేలా ఫాగ్ ఉంటుంది. సినిమా థియేటర్ తరహాలో సోఫా సీట్లు ఏర్పాటు చేశారు. ఎల్‌ఈడీ లైటింగ్, కేక్‌లు కట్ చేసుకునేందుకు వేదిక ఉంటుంది. వేదికపై డెకరేషన్, లైటింగ్ ఏర్పాటు చేస్తున్నారు. వైఫై సౌకర్యం, థియేటర్ బయట అందమైన బ్యాక్‌డ్రాప్‌లు రూపొందిస్తున్నారు. 16 డిగ్రీల సెల్సియస్‌తో చల్లటి వాతావరణం ఉండేలా ఏసీ సౌకర్యం కల్పిస్తున్నారు. ఇంటిల్లిపాదీ వెళ్లి ఆనందంగా వేడుక నిర్వహించుకునేలా అన్ని సౌకర్యాలు ఉండడం ఈ మినీ థియేటర్ల ప్రత్యేకత.


ప్రజల అభిరుచికి తగ్గట్టుగా మినీ థియేటర్‌లో అలంకరణలు



ప్రత్యేకతలేమిటంటే...

ఈ మినీ థియేటర్లలో డాల్బీ సౌండ్ సిస్టమ్‌తో ఎల్‌ఈడీ స్ర్కీన్ ఏర్పాటు చేశారు. అందులో ఇష్టమైన సినిమా, టీవీ షోలను వీక్షిస్తూ ఆస్వాదించొచ్చు. కొందరైతే గతంలో రికార్డు చేసిన ఫంక్షన్ల పెన్‌డ్రైవ్‌లు, కాలేజీల్లో జరిగిన ఫ్రెషర్స్ డే వేడుకలు, ఫేర్‌వెల్ పార్టీల వీడియోలు తీసుకొచ్చి వాటిని ప్రదర్శించుకుంటూ జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందం పొందుతున్నారు. స్నాక్స్, ఇతర ఫుడ్ ఐటమ్‌లు, బెవరేజస్ తెప్పించుకుని సెల్ఫ్ సర్వ్ చేసుకుంటూ సంతోషంగా గడుపుతున్నారు.


ఆకట్టుకునేలా లైటింగ్


మినీ థియేటర్‌లో ఫంక్షన్ వేళ...

రెస్పాన్స్ బాగుంది



మేము తొలుత హైదరాబాద్‌లో ఈ మినీ థియేటర్‌ను ఏర్పాటు చేశాం. స్మార్ట్ సిటీ కాకినాడలో కూడా ఇలాంటి కల్చర్ ప్రజలకు అందుబాటులో ఉండాలనే ఆలోచనతో జేఎన్టీయూ ఎదురుగా ఉన్న వీధిలో మినీ థియేటర్ ఏర్పాటు చేశాం. రెస్పాన్స్ బాగుంది. సింపుల్‌గా చిన్న చిన్న పార్టీలు సరదాగా రెండు, మూడు గంటలు గడిపేలా వాతావరణం క్రియేట్ చేశాం. చాలా మంది సందర్శిస్తున్నారు.

- వేణుగోపాల్, మినీ థియేటర్ నిర్వాహకుడు


జేఎన్టీయూకే ప్రధాన పరిపాలనా భవనం

వచ్చే నెల 4న

జేఎన్టీయూకే 11వ స్నాతకోత్సవం

- అధ్యక్షత వహించనున్న కులపతి, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్
- 2023-24 విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు డిగ్రీల ప్రదానం
- ముఖ్య అతిథి, బోస్టన్ గ్రూప్ చైర్మన్ కోట సుబ్రహ్మణ్యానికి గౌరవ డాక్టరేట్
- ప్రత్యేక అతిథిగా పాల్గొననున్న విద్యా శాఖ మంత్రి లోకేశ్

జేఎన్టీయూకే, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ 11వ స్నాతకోత్సవాన్ని వచ్చే నెల వర్శిటీలోని అలూమ్ని ఆడిటోరియంలో మధ్యాహ్నం మూడు గంటల నుంచి నిర్వహించనున్నట్టు ఉప కులపతి ప్రొఫెసర్ సీఎస్ ఆర్కే ప్రసాద్ తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేస్తామన్నారు. విశ్వవిద్యాలయ కులపతి, రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ అధ్యక్షత వహిస్తారన్నారు. ముఖ్య అతిథిగా హాజరయ్యే అమెరికాలోని బోస్టన్ గ్రూప్ చైర్మన్ కోట సుబ్రహ్మణ్యం (సుబు కోట)కు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తామన్నారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక అతిథిగా పాల్గొంటారన్నారు. బీటెక్, బి.ఫార్మసీ, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, ఎం.ఫార్మసీ, బీబీఏ, ఫార్మా-డి, బీఆర్క్ విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేస్తామని ఇన్‌చార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్ తెలిపారు. 99 మంది రీసెర్చ్‌స్కాలర్స్ పీహెచ్‌డీ పట్టాలు అందుకోనున్నారు. కులపతి, ఇతర అతిథుల సమక్షంలో ప్రతిభావంతులైన 40 మంది విద్యార్థులకు ఎండోమెంట్, బంగారు పతకాలు అందజేస్తారని తెలిపారు. స్నాతకోత్సవ వేడుకల్లో మాజీ ఉప కులపతులు, అతిథులు, విద్యావేత్తలు, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి అధికారులు, ఉన్నత విద్యా శాఖాధికారులు, జిల్లా అధికారులు, విద్యావేత్తలు, వర్శిటీ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొనాలని కోరారు.

డిగ్రీలు, పీహెచ్‌డీలు, బంగారు, ఎండోమెంట్ పతకాల వివరాలు

కోర్సు పేరు	2023-24 విద్యా సంవత్సరం
బీటెక్	41,258
బి.ఫార్మసీ	2,081
ఎంటెక్	1,659
ఎంబీఏ	3,797
ఎంసీఏ	1,115
ఎం.ఫార్మసీ	458
బీబీఏ	115
ఫార్మా-డి	274
బీఆర్క్	83
పీహెచ్‌డీ	100

నన్నయలో విద్యాప్రవేశాలకు ఆహ్వానం


కోర్సుల వివరాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, జూన్27 (ఆంధ్రజ్యోతి) : ఏపీ పీజీ సెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులను ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ప్రవేశాలకు ఆహ్వానిస్తున్నామని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. విశ్వవిద్యాలయంలోని వీసీ కార్యాలయంలో విశ్వవిద్యాలయాల ప్రవేశాలకు సంబంధించిన బ్రోచర్‌ను శుక్రవారం వీసీ ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నన్నయ వర్శిటీ రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్‌లలో ఆర్ట్స్ అండ్ కామర్స్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగాల్లో పీజీ కోర్సులు అందిస్తున్నామన్నారు. ఆయా క్యాంపస్‌లలో అందుబాటులో ఉన్న కోర్సులు వివరాలు తెలిపారు. తాము పేర్కొన్న వివిధ కోర్సులకు సంబంధించి ప్రభుత్వం నిర్వహించే కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌లో అర్హత సాధించిన వారికి ప్రవేశం అభిస్తుందన్నారు. రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం ప్రాంగణాల్లో అడ్మిషన్ పొందిన అర్హులైన విద్యార్థులకు ప్రభుత్వ రాయితీలు వర్తిస్తాయని తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌ను లేదా 70930 08477 నెంబరును సంప్రదించాలని తెలిపారు. అడ్మిషన్‌ల ప్రక్రియను డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఆచార్య పి.ఉమామహేశ్వరీదేవి, అసోసియేట్ డైరెక్టర్ ఎన్.సజనారాజ్ నిర్వహిస్తారన్నారు.

కాపులను సంఘటితం చేస్తాం


ఎంపీ సతీష్‌బాబును సత్కరిస్తున్న క్రికెట్ అసోసియేషన్

రాజ్యసభ సభ్యుడు సతీష్‌బాబు

సామర్లకోట, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాపులందరినీ ఏకతాటిపైకి తెచ్చి ఆ సామాజికవర్గం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడం ద్వారా సంఘటితం చేస్తామని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు వెల్లడించారు. కాకినాడ జిల్లా సామర్లకోట మండలం కొప్పవరంలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన ఉమ్మడి జిల్లాలకు చెందిన కాపు సంఘ నాయకులు, కాపు ప్రముఖులతో అంతరంగిక సమావేశం నిర్వహించారు. అనంతరం ఎంపీ విలేకరులతో మాట్లాడుతూ గతంలో జరిగిన పలు ఉద్యమాలను దృష్టిలో ఉంచుకుని ఏ వర్గానికీ, ఏ నాయకుడికీ అవమానం జరుగని రీతిలో కాపు నాయకులతో సమీక్షిస్తానన్నారు. రాష్ట్రంలో కాపు సంఘాలను లీడ్ చేయాలన్న ఆలోచన తనకు ఎంతమాత్రం లేదని ఒక ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. ఆ సామాజిక వర్గానికి చెందిన రాజ్యసభ సభ్యుడిగా, సీఎం చంద్రబాబు, ఐటీ మంత్రి లోకేశ్‌లతో ఉన్న సాన్నిహిత్యంతో పేద కాపులందరికీ న్యాయం చేసేందుకు తన వంతు ప్రయత్నంగా ముందుకొచ్చానన్నారు. రాష్ట్రంలోని కాపు నాయకుల అభిప్రాయాలను, సూచనలను పరిగణలోకి తీసుకుంటానని, తన ప్రయత్నానికి సహకారం కావాలన్నారు.

ఎంపీని కలిసిన క్రికెట్ అసోసియేషన్

కాకినాడ సిటీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు శుక్రవారం ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబును కాకినాడలోని శాంతినగర్‌లో తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎంపీని కలిసిన వారిలో అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శివకుమార్, కార్యదర్శి కొప్పన ప్రసాద్, కోశాధికారి భారతం సూర్యనారాయణమూర్తి, సంయుక్త కార్యదర్శి నక్క శ్రీనగేష్, కౌన్సిల్ మెంబర్లు ఏవీటీ వర్మ, బీవీఎల్ నరసింహరావు తదితరులున్నారు.

తిరుపతి జిల్లా నుంచి పలువురు బీజేపీలో చేరిక

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి సమక్షంలో శుక్రవారం తిరుపతి జిల్లాకు చెందిన పలువురు బీజేపీలో చేరారు. రాజమహేంద్రవరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పురందేశ్వరి కండువాలను కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. తిరుపతి జిల్లా సత్యవేడు అసెంబ్లీ కన్వీనర్ మునిస్వామి ఆధ్వర్యంలో పిచ్చాటురు మండలం మాజీ వైస్ ఎంపీపీ బొరందూరు పద్మనాభం, రామాపురం మాజీ ఎంపీటీసీ కన్నెగాన్ వడివేలు, వేలూరు గ్రామ మాజీ సర్పంచ్ పల్లా శేఖర్, వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర గజేంద్ర తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న పీడీజే సునీత

పీడీజే సునీత

రాజమహేంద్రవరం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): జూలై 5న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత ఆదేశించారు. ఈ మేరకు పోలీస్, ఎక్సైజ్ అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజీకి అర్హమైన కేసులు అధిక సంఖ్యలో పరిష్కారం కావడానికి ఇరు పక్షాలకు జాతీయ లోక్ అదాలత్ గురించి తెలియజేయాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే విధంగా చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి, కోనసీమ ఈఎస్ ప్రసాద్, అడిషనల్ ఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్, తూర్పుగోదావరి అడిషనల్ ఎస్పీ మురళీ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నల్సా పథకాలపై నేడు వర్క్‌షాప్

జాతీయ లీగల్ సర్వీసెస్ అథారిటీ(నల్సా) పథకాలపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా యంత్రాంగం సంయుక్తంగా శనివారం ఉదయం నుంచి రాజమహేంద్రవరం ఆనం కళా కేంద్రంలో కార్యశాల నిర్వహిస్తున్నామని కార్యక్రమ సమన్వయకర్త, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి శుక్రవారం తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత, డీఎల్ ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి, కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిషోర్ తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు.

నేటి నుంచి జీజీయూలో జాతీయ సెమినార్

రాజానగరం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం(జీజీయూ)లో ఈ నెల 28 నుంచి రెండు రోజుల పాటు వికసిత్ భారత్ ఎట్ ది రేట్ 2047 కోసం పరిశోధన, ఆవిష్కరణలను ఉపయోగించడం అనే అంశంపై జాతీయ సెమినార్ నిర్వహిస్తున్నట్టు ఛాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు(చైతన్యరాజు), ప్రో ఛాన్సలర్ కె.శశికిరణ్ వర్మ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను శుక్రవారం ఇక్కడి విలేకరులకు వివరించారు. జీజీయూలో 28,29 తేదీల్లో జరిగే ఈ సెమినార్‌లో నీతి అయోగ్ సభ్యులు విజయకుమార్ సరస్వతి, అఖిల భారత సాంకేతిక విద్యా మండలి(ఏఐసీటీఈ) చైర్మన్ ఆచార్య టీజీ సీతారాం, బయోటెక్నాలజీ పరిశ్రమ పరిశోధన సహాయ మండలి(బైరాక్) మేనేజింగ్ డైరెక్టర్ జితేంద్రకుమార్, ఐసీఎంఆర్ అడిషనల్ డైరెక్టర్ సంఘమిత్ర పాటి, అఖిల భారత ఆయుర్వేద సంస్థ డైరెక్టర్ తనూజ నేసారి, సీఎస్ఐఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మినరల్స్ అండ్ మెటీరియల్స్ టెక్నాలజీ డైరెక్టర్ రామానుజ నారాయణ తదితర ప్రముఖులు హాజరై ప్రసంగిస్తారన్నారు. అలాగే దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వివిధ రంగాల్లో నిష్ణాతులైన దాదాపు 50 మందికి పైగా ప్రతినిధులు విచ్చేసి వివిధ అంశాలపై ఉపన్యసిస్తారన్నారు. బోధన, పరిశోధన, పారిశ్రామిక రంగాల నుంచి దాదాపు 250 మంది సెమినార్‌కు హాజరవుతారని చెప్పారు. సమావేశంలో జీజీయూ వైస్ చాన్సలర్ యు.చంద్రశేఖర్, ప్రో వైస్ చాన్సలర్ కేవీబీ రాజు, రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ, ఎం.శ్రీనివాసరావు, పరిశోధన సలహాదారు శిశిర్ సాహ, డైరెక్టర్ టీవీ ప్రసాద్, యూనివర్శిటీ ప్రాంగణంలోని వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

ఒకే రకమైన మెరైన్ యాక్ట్‌ను అమలు చేయాలి

విశాఖపట్నం సీఎంఎఫ్ఆర్ఐ శాస్త్రవేత్తలు

కాకినాడ సిటీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో విస్తరించియున్న సముద్ర తీర ప్రాంత రాష్ట్రాలన్నింటికి ఒకే రకమైన మెరైన్ యాక్ట్‌ను అమలు చేయాలని విశాఖపట్నం సీఎంఎఫ్ఆర్ఐ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. మత్స్యశాఖ కమిషనర్ సూచనల మేరకు ఆంధ్రప్రదేశ్ మెరైన్ ఫిషరీస్ రెగ్యులేషన్ యాక్ట్-1994, దాని నిబంధనల నవరణ నిమిత్తం సలహాలు, సూచనలు స్వీకరించేందుకు కాకినాడ జగన్నాథపురంలోని రాష్ట్ర మత్స్య సాంకేతిక పరిజ్ఞాన సంస్థ(ఎస్ఐఎఫ్ఈటీ)లో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అంజలి ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు, ఏపీ ఫిషరీస్ యూనివర్శిటీ ప్రతినిధులు, వివిధ జిల్లాల మత్స్యశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు.విశాఖపట్నం నుంచి సీఎంఎఫ్ఆర్ఐ శాస్త్రవేత్త డాక్టర్ ముక్త, సీఐఎఫ్‌టీ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీధర్, ఎఫ్ఎస్ఐ శాస్త్రవేత్త ప్రసాద్, నెట్ ఫిష్ స్టేట్ కో-ఆర్డినేటర్ హనుమంతరావు, శాస్త్రవేత్త ప్రభంజన్‌కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అంజలి మాట్లాడుతూ వర్తమానం, భవిష్యత్తులో రాబోయే మార్పుల దృష్ట్యా ఈ యాక్ట్‌లో నవరణలు చేయడానికి సలహాలు, సూచనలివ్వాలని కోరారు. శాస్త్రవేత్తలు, మత్స్యశాఖ అధికారులు మాట్లాడుతూ ఏపీ మెరైన్ ఫిషరీస్ రెగ్యులేషన్ యాక్ట్‌ను సమర్థవంతంగా అమలు చేయడంలో సవాళ్లను అధిగమించాలన్నారు. సంప్రదాయ మత్స్యకారులకు రిజర్వ్ చేయాల్సిన సముద్ర జలాలు, వివిధ రకాల బోట్లు పొడవు, ఇంజన్ సామర్థ్యం తదితర అంశాలపై సూచనలు చేశారు.

వాడపల్లి వెంకన్నకు 3 టన్నుల కూరగాయలు


సీతానగరం నుంచి కూరగాయలను పంపుతున్న దృశ్యం

సీతానగరం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేడ్కర్ కోనసీమ ఆత్రేయపురం మండలం వాడపల్లిలోని వాడపల్లి వెంకన్న ఆలయానికి తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం నుంచి శుక్రవారం 3 టన్నుల కూరగాయలు విరాళంగా పంపించారు. అక్కడ ఆలయంలో జరుగుతున్న నిత్యాన్నదాన కార్యక్రమానికి వాకపల్లి సూరిబాబు ఆధ్వర్యంలో సీతానగరం మండల ప్రజలు సమష్టిగా 3టన్నుల కూరగాయలు సమకూర్చి శుక్రవారం పంపించారు. కార్యక్రమంలో పలివెల వీరబాబు, కోసూరి త్రిమూర్తులు, సింగవరం సర్పంచ్ సంగన పోశియ్య, పోలినాటి నరసింహమూర్తి పాల్గొన్నారు.

రాష్ట్రానికి కాంగ్రెస్ పాలన అవసరం

పోలవరం ఎత్తు తగ్గించి అన్యాయం చేశారు

యోగాపై ఉన్న శ్రద్ధ రాష్ట్రాభివృద్ధిపై లేదు

పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలారెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి కాంగ్రెస్ పాలన అవసరమని పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిళారెడ్డి అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం షర్మిళారెడ్డి, ఏపీ సీసీ ఇన్‌చార్జి పాలక్ వర్మతో కలిసి రాజమహేంద్రవరం చేరుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక కృష్ణసాయి కళ్యాణ మండపంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేశారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో షర్మిళారెడ్డి మాట్లాడారు. రాష్ట్రాన్ని బీజేపీ దారుణంగా మోసం చేసిందన్నారు. విభజన హామీల్లో ఒక్కటీ అమలు కాలేదన్నారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించి మోసం చేశారన్నారు. 45మీటర్ల నుంచి 41కి ఎత్తు తగ్గిస్తే అది ప్రాజెక్టు ఎలా అవుతుందని ప్రశ్నించారు. రాష్ట్రంలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ మోదీకి ఊడిగం చేస్తున్నారని, పార్టీలన్నీ గులాం గిరి చేస్తున్నాయన్నారు. విభజన హామీల్లో ఒకటైన రాజధానిని కేంద్రమే నిర్మించి ఇవ్వాలని, కాని అప్పు ఇచ్చిందన్నారు. అభివృద్ధిని పక్కన పెట్టి యోగా చేసి ప్రధాని వెళ్లిపోయారని, యోగాపై ఉన్న శ్రద్ధ రాష్ట్ర అభివృద్ధిపై లేదన్నారు. దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలని, రాహుల్‌గాంధీ ప్రధాని కావాలన్నారు.రానున్న నాలుగేళ్లు అత్యంత కీలకమని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి జిల్లా పర్యటనలు, విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

పీసీసీ చీఫ్‌కు ఘనస్వాగతం.. రాజమహేంద్రవరం పర్యటనకు వచ్చిన పీసీసీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిళారెడ్డికి జిల్లా కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. గోకవరం బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి షర్మిళ నివాళులర్పించారు. ఆపై సీతంపేట వాటర్ ట్యాంక్‌ల వరకు గుర్రంబండిపై ఊరేగింపు జరిపారు.అక్కడ రాజీవ్‌గాంధీ పార్కులో దివంగత ప్రధాని ఇందిరా గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో ఏఐసీసీ నేత గిడుగు రుద్రరాజు, మాజీ కేంద్ర మంత్రి పల్లంరాజు, మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్, డాక్టర్ వడయార్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నేతలు, కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో పాల్గొన్న షర్మిళారెడ్డి

డిగ్రీ అడ్మిషన్లు ఎప్పుడో!

- ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లోనా
- ఎటూ తేల్చని ప్రభుత్వం
- ఇంటర్ ఫలితాలు వచ్చి ఇప్పటికే రెండు నెలలు
- పలు ప్రైవేటు కళాశాలల్లో విద్యార్థుల ముందస్తు చేరికలు
- ప్రభుత్వ కాలేజీల్లో సీట్లు మిగిలిపోయే అవకాశం
- ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి

ఇంటర్మీడియట్ ఫలితాలు వచ్చి రెండు నెలలు కావస్తోంది. అయితే డిగ్రీ కళాశాలల్లో ప్రవేశ ప్రకియ ఇప్పటి వరకు ప్రారంభం కాలేదు. అడ్మిషన్లను ఆన్‌లైన్‌లో లేదా ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలనే విషయంపై ప్రభుత్వం ఎటూ తేల్చకపోవడంతో సందిగ్ధత నెలకొంది. ప్రవేశాలపై అధికారిక ప్రకటన రాకుండానే ప్రైవేటు కళాశాలలు ముందస్తుగానే విద్యార్థులను చేర్చుకుంటున్నాయి. ఆన్‌లైన్‌లో తమ కళాశాలనే ఎంచుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. ఫలితం గా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సీట్లు మిగిలిపోయే అవకాశం ఉంది. నన్నయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది.

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు ఎప్పుడు ప్రారంభమవుతాయో తెలియట్లేదు. ఇప్పటికే 1 నుంచి 10వ తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశాలు పూర్తయి తరగతులు ప్రారంభమయ్యాయి. డిగ్రీలో మాత్రం అందుకు విరుద్ధంగా వుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ప్రవేశాలపై ఎటువంటి స్పష్టత ఇవ్వలేదు. గత వైసీపీ ప్రభుత్వం డిగ్రీ విద్యను అస్తవ్యస్తం చేయడం, ఆన్‌లైన్ ప్రక్రియలో ప్రవేశాలతో సృష్టించిన గందరగోళంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారు. ఇప్పుడు దానిని సరిచేసే పనిలో ఉన్న ఉన్నత విద్యాశాఖ, రాష్ట్ర ఉన్నత విద్యామండలి సమయం అధికంగా తీసుకోవడంతో దాని ప్రభావం డిగ్రీ ప్రవేశాలపై పడింది. ప్రవేశాలను ఎప్పటికి ప్రారంభిస్తారనే విషయాన్ని ఇప్పటివరకు ఎవరూ చెప్పలేకపోతున్నారు.

అస్తవ్యస్తం ఆన్‌లైన్ విధానం

కాకినాడ జిల్లాలో కాకినాడ నగరంతో పాటు పిఠాపురం, తుని, ఏలేశ్వరం, జగ్గంపేట, పెరుమాళ్లపురం, పెద్దాపురంల్లో ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలలు ఉన్నాయి. వీటికి దాదాపు మూడు రెట్లు అదనంగా ప్రైవేటు డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. వీటిల్లో 20వేలకు పైగా సీట్లు ఉన్నాయి. కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికి గతం నుంచీ అమల్లో ఉన్న విధానాన్ని వైసీపీ ప్రభుత్వం మార్చివేసింది.




పిఠాపురంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల

2022-23 విద్యా సంవత్సరం నుంచి ఆన్‌లైన్ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. ఫలితంగా ప్రవేశాల్లో తీవ్ర గందరగోళానికి దారితీసింది. అప్పటిదాకా జూన్ నెలాఖరుకు పూర్తయ్యే ప్రవేశాలు ఆగస్టు, సెప్టెంబరు నెలలకు గానీ పూర్తి కాని పరిస్థితులు ఏర్పడ్డాయి. ఫలితంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సీట్లు భారీగా మిగిలిపోయాయి. దీంతో మరలా ఆఫ్‌లైన్ విధానం అమలు చేయాలన్న వాదనలు వినిపిస్తున్నాయి.

ఎటూ తేలని సబ్జెక్టు విధానం

డిగ్రీలో ఉన్న విద్యా విధానాన్ని గత వైసీపీ ప్రభుత్వం మార్చివేసింది. అప్పటివరకు అమలులో ఉన్న మూడు సబ్జెక్టుల విధానాన్ని రద్దు చేసి సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానాన్ని అమలు చేసింది. దీనికి అనుగుణంగా అన్ని రకాల సబ్జెక్టులను ప్రభుత్వ కళాశాలల్లో అందుబాటులో ఉంచకపోవడంతో విద్యార్థులు ప్రైవేటు కళాశాలల వైపు మొగ్గుచూపడం ప్రారంభించారు. ఈ విధానం సరిగా లేదని భావించిన రాష్ట్ర ఉన్నత విద్యా మండలి డబుల్ మేజర్ సబ్జెక్టు విధానం అమలు చేస్తామని ప్రకటించినా ప్రభుత్వం నిలిపివేయాలని ఆదేశించి పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వాలని సూచించింది. అందుకనుగుణంగా సింగిల్ మేజర్ లేదా డబుల్ మేజర్ సబ్జెక్టుల విధానం అమలు గురించి ఉన్నత విద్యా మండలి సవివరంగా ప్రభుత్వానికి నివేదిక పంపింది. దీనిపై ప్రభుత్వ స్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

నెలకు పైగా సాగే ప్రక్రియ



ఆన్‌లైన్‌లో లేదా ఆఫ్‌లైన్‌లో అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించినా అది నెలకు పైగా సాగుతుం ది. గతంలో ఇందుకు రెండు నెలల సమయం తీసుకున్నారు. ఇప్పటిదాకా ప్రవేశాల షెడ్యూల్ విడుదల చేయకపోవడంతో పాటు ఏ విధంగా అడ్మిషన్లు జరపాలన్న దానిపై నిర్ణయం తీసు కోలేదు. ఆన్‌లైన్‌లో అయితే రిజిస్ట్రేషన్ ప్రక్రియ, కళాశాలలు, కోర్సులు ఎంచుకునేందుకు వెబ్ ఆప్షన్లు, సీట్ల కేటాయింపు, తర్వాత ప్రవేశాలు జరగాల్సి ఉంటుంది. తొలి విడతలో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు మరో రెండు విడతలు ప్రక్రియ నిర్వహించాలి. ఇదంతా జరిగి క్లాసులు ప్రారంభమయ్యేసరికి ఆగస్టు నెల వస్తుందని చెప్తున్నారు. ఆఫ్‌లైన్‌లో అయితే మొత్తం ప్రకియను 15రోజుల్లో పూర్తి చేసి తరగతులు ప్రారంభించే వీలుంటుంది.

విద్యార్థులు ఇప్పటికే అటువైపు

అడ్మిషన్ల ప్రక్రియ ప్రకటనలో జరుగుతున్న జాప్యాన్ని ప్రైవేటు కళాశాలలు తమకు అనుకూలంగా మార్చుకున్నాయి. ఇంటర్ ఫలితాలు వచ్చిన వెంటనే కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోని తమ కళాశాలల్లో వారిని అనధికారికంగా చేర్చుకోవడంతో పాటుమార్కుల జాబితాలు, టీసీ, ఇతర సర్టిఫికెట్లను వారి వద్ద ఉంచుకున్నాయి. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైన వెంటనే ఇప్పటికే చేరినవారిని దరఖాస్తు చేయించి తమ కళాశాలలను ఆప్షన్లుగా ఎంచుకునే విధంగా ఏర్పాట్లు చేసుకున్నారు. దీనివల్ల ప్రైవేటు కళాశాలలకు అధిక ప్రయోజనం కలుగుతుండగా, ప్రభుత్వ కళాశాలల్లో సీట్లు పూర్తిగా నిండట్లేదు. గత రెండు సంవత్సరాలలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో పలు సీట్లు ఖాళీగా ఉండిపోయాయి. ప్రవేశాల్లో ఇంకా జాప్యం జరిగితే ఇదే పరిస్థితి ఈ ఏడాదీ కొనసాగే అవకాశముంది. ప్రభుత్వం స్పందించి ప్రవేశాల షెడ్యూల్ ప్రకటించడంతో పాటు సింగిల్ లేదా డబుల్ మేజరు సబ్జెక్టులపై త్వరగా తుది నిర్ణయం తీసుకోవాలని విద్యావేత్తలు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.



ఆలమూరులో కానిస్టేబుల్ బ్లెసన్ అంత్యక్రియలు నిర్వహిస్తున్న పోలీసులు

కానిస్టేబుల్ బ్లెసన్‌కు కన్నీటి వీడ్కోలు

● అధికార లాంఛనాలతో అంత్యక్రియలు ● పాల్గొన్న డీఎస్పీ, సీఐలు, సిబ్బంది

ఆలమూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కోదాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కోనసీమ జిల్లా ఆత్రేయపురం పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ ఎస్.బ్లెసన్ అంత్యక్రియలు ఆలమూరులో శుక్రవారం పోలీస్ అధికార లాంఛనాలతో జరిగాయి. గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో బ్లెసన్ మృతిచెందిన విషయం తెలిసిందే. అంత్యక్రియలు శుక్రవారం ఉదయం బ్లెసన్ ఇంటి వద్ద ప్రారంభమయ్యాయి. ముందుగా కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్.విద్యాసాగర్, రావులపాలెం టౌన్ సీఐ శేఖర్‌బాబు, ఆలమూరు ఏఎస్ఐ సూర్యచంద్రరావుతోపాటు రావులపాలెం సర్కిల్ పరిధిలోని పలువురు సిబ్బంది బ్లెసన్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత మృతదేహాన్ని ఊరేగింపుగా గోదావరి గట్టుకు కన్నీటి వీడ్కోలుతో తరలించారు. అక్కడ పోలీస్ అధికార లాంఛనాలతో గాలిలోకి కాల్పులు జరిపి పోలీసు వందనం చేసి పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలతో అంత్యక్రియలు నిర్వహించారు.



బ్లెసన్ (ఫైల్)

ఆర్థిక ఇబ్బందులు తాళలేక
కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం

సామర్లకోట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వెంటూరి దుర్గేష్ గురువారం అర్ధరాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆర్థిక ఇబ్బందులకు తాళలేక దుర్గేష్ ఇలా చేసినట్టు ప్రాథమికంగా గుర్తించారు. ప్రస్తుతం మాధవపట్నంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా శుక్రవారం సాయంత్రం నాటికి అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్టు వైద్యులు చెప్పారని దుర్గేష్ కుటుంబ సభ్యులు తెలిపారు. అమలాపురానికి చెందిన దుర్గేష్ ప్రస్తుతం కాకినాడలోని జగన్నాథపురంలోని అత్తవారింట నివాసం ఉంటున్నాడు. విజయవాడ పిటి వారెంట్‌కి వెళ్లి తిరిగొచ్చి రెస్ట్‌లో ఉన్నట్టు తెలుస్తోంది. గురువారం అర్ధరాత్రి 12 గంటలకు వీకె.రాయపురం బస్టాండ్ వద్ద అపస్మారక స్థితిలో ఉన్న దుర్గేష్‌ను చూసిన స్థానికుల సమాచారంతో కుటుంబసభ్యులు వీకె.రాయపురం వెళ్లి మాధవపట్నంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



దుర్గేష్

అనకాపల్లి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

కంటైనర్ లారీని బొలేరో వ్యాన్ ఢీకొని డ్రైవర్, మహిళ మృతి

డ్రైవర్ సొంతూరు కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామం

కశింకోట (అనకాపల్లి జిల్లా), జూన్ 27 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా కశింకోట మండలం జమాదులపాలెం సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రోడ్డుపై ఆగి ఉన్న కంటెయినర్ లారీని వెనుక నుంచి వస్తున్న బొలేరో వ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో మహిళతో సహా ఇద్దరు మృతిచెందారు. మరో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ లక్ష్మణరావు తెలిపిన వివరాలిలా ఉన్నా యి. కశింకోట మండలం తీడ గ్రామానికి చెందిన కన్నూరు లక్ష్మి(40), అనకాపల్లి మండలం కోడూరు గ్రామానికి చెందిన ఎస్.వరలక్ష్మి గాజువాకలో పూల వ్యాపారం చేస్తుంటారు. ఇందుకోసం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో హోల్‌సేల్‌గా పూలు కొనుగోలు చేసి తీసుకువస్తుంటారు. గురువారం కూడా ఇద్దరూ కలిసి రాజమహేంద్రవరం వెళ్లి పూలు కొనుగోలు చేశారు. తిరిగి రావడానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లా రావులపాలెం నుంచి దొండ కాయల లోడుతో అనకాపల్లి వైపు వస్తున్న బొలేరో వ్యాన్‌లో ఎక్కారు. ఇదే జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన పి.సత్యనారాయణ (25) వ్యాన్ డ్రైవ్ చేస్తున్నాడు. మహిళలిద్దరూ డ్రైవర్ పక్కన క్యాబిన్‌లో కూర్చున్నారు. వ్యాన్ గురువారం అర్ధరాత్రి 1.45 గంటలకు కశింకోట మండలం జామాదుల పాలెం వద్ద రోడ్డుపై ఆగి ఉన్న కంటైనర్ లారీని వెనుక నుంచి బలంగా ఢీకొంది. ఇంజన్‌తో సహా వ్యాన్ ముందుభాగం పూర్తిగా కంటైనర్ లారీ కిందకు దూసుకుపోయింది. దీంతో డ్రైవర్ సత్యనారాయణ, కన్నూరు లక్ష్మి వ్యాన్ శకలాల్లో ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతిచెందారు. వరలక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను అన కాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు పంపారు. మృతదేహాలను అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. మధ్యాహ్నం పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కన్నూరు లక్ష్మి భర్త వరహాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ లక్ష్మణరావు చెప్పారు.



సత్యనారాయణ (ఫైల్‌ఫొటో)

విజయవాడ దుర్గమ్మకు
అన్నవరం తరుపున సారె, చీర

అన్నవరం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): అన్నవరం సత్యదేవుడి సోదరిగా విరాజిల్లుతున్న విజయవాడ కనకదుర్గకు శుక్రవారం అన్నవరం దేవస్థానం తరుపున ఈవో సుబ్బారావు దంపతులు ఆషాఢం సారె, చీరలను అందించారు. ఈ సందర్భంగా అన్నవరం దేవస్థానం నుంచి వెళ్లిన పండితులకు, అధికారులకు అక్కడ ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికారు. సత్యదేవుడి కల్యాణోత్సవాలకు విజయవాడ దేవస్థానం నుంచి పట్టువస్త్రాలు, దసరా నవరాత్రులలో అన్నవరం దేవస్థానం నుంచి అక్కడికి పట్టువస్త్రాలను పట్టుకెళ్లడం ఆనవాయితీగా వస్తుంది.



విజయవాడ దుర్గమ్మ ఆలయంలో ఆషాఢం సారెను తీసుకెళ్తున్న అన్నవరం ఆలయ ఈవో దంపతులు

తలుపులమ్మకు ఆషాఢం సారె సమర్పణ

తుని రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసోత్సవాలు పురస్కరించుకుని తొలి శుక్రవారం కాకినాడ జిల్లా తలుపులమ్మ తల్లి లోవ దేవస్థానంలో సారె సమర్పించే కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ ఆచారం ప్రకారం తుని రాజవంశీయులు ఎస్ఆర్‌వీ శ్రీని వాసరాజు, పృథ్వీరాజు, రమేష్ రాజు కుటుంబాలు తరలివచ్చి అమ్మవారికి చీర, పసుపు, కుంకుమ, గాజులు సమర్పించారు. ప్రత్యేక పూజలు అనంతరం ఆలయ పండితులు వారికి వేద ఆశీర్వచనాలు అందించారు.



అమ్మవారికి సారె తీసుకొస్తున్న రాజవంశీయులు



తలుపులమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కాలు జారి చెరువులో పడి వ్యక్తి మృతి

ముమ్మిడివరం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): బహిర్భూకి వెళ్తూ ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడి మృతిచెందాడు. కోనసీమ జిల్లా రావులపాలెనికి చెందిన సబ్బతి అంబేద్కర్ (37) భార్య గంగాభవానీతో కలిసి 2 రోజుల క్రితం ముమ్మిడివరం నగర పంచాయతీ వృద్ధ గౌతమీ మురుగుకాల్వ పక్కన రాజుపాలెంలో తన తోడల్లుడు గోడ కృష్ణ కాపలా ఉంటున్న చెరువుల వద్దకు వచ్చాడు. శుక్రవారం ఉదయం బహిర్భూమికి బయలుదేరిన అంబేద్కర్ ప్రమాదవశాత్తూ కాలు జారి చెరువులో పడిపోయాడు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో కృష్ణ, అక్కడి వారు వెతగ్గా చెరువులో అంబేద్కర్ మృతదేహం లభ్యమైంది. గంగాభవానీ ఫిర్యాదుతో ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



మరణించిన ఎస్.అంబేద్కర్

విద్యామిత్ర కిట్ల స్టాక్ పాయింట్ పరిశీలన

తొండంగి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్ల స్టాక్ పాయింటును శుక్రవారం రాష్ట్ర పరిశీలకుడు సీహెచ్.భాస్కర్రావు పరిశీలించారు. కాకినాడ జిల్లా తొండంగి ఉన్నత పాఠశాలలో ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన స్టాక్ పాయింటులో రికార్డులు తనిఖీ చేశారు. యూనిఫాం, బూట్లు, సాక్సు పరిశీలించారు. ఎప్పుడు వచ్చిన సరుకును అప్పటికప్పుడు పాఠశాలలకు పంపించాలని సూచించారు. మెగా పేరెంట్స్ డే జరిగే జూలై 5 నాటికి ప్రతి విద్యార్థి యూనిఫాంతో హాజరయ్యే విధంగా తల్లి దండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. తరగతి గదికి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. అందరికి పాఠ్యపుస్తకాలు అందాయాలేదా అన్నది ఆరా తీసారు. ఏఎంవో చామంతి నాగేశ్వరావు, తొండంగి ఎంఈవో 2 సుబ్బిరెడ్డి, యు.కొత్తపల్లి ఎంఈవో 2 పైడిరాజు, సీఆర్పీలు ఉన్నారు.



తొండంగిలో షూలు పరిశీలిస్తున్న భాస్కర్రావు

శోభాయమానంగా..

రాజమహేంద్రవరంలో జగన్నాథస్వామి రథయాత్ర, తరలివచ్చిన భక్తజనం

రాజమహేంద్రవరం కల్చరల్ జూన్ 27(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఇస్కాన్ మందిరం ఆధ్వర్యంలో శుక్రవారం వేలాది మంది భక్తులతో జగన్నాథస్వామి రథయాత్ర శోభాయమానంగా జరిగింది. శ్యామలానగర్ రామాలయం సెంటర్ నుంచి ప్రారంభమైన యాత్రలో శ్రీజగన్నాథ బలదేవ సుభద్రల మూలవిరాట్‌ను ప్రతిష్ఠించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, స్థానిక ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ విచ్చేసి హారతిచ్చారు. వారికి ఇస్కాన్ మందిర కమిటీ ముఖ్య సభ్యుడు సత్యగోపీనాథ్ దాస్ ప్రసాదాలు అందజేశారు. అనంతరం రథయాత్రకు శ్రీకారం చుట్టారు. వేలాది మంది భక్త పారవశ్యంతో రథాన్ని లాగారు. కోలాట భజనలు, సాంస్కృతిక ప్రదర్శనలు, కీర్తనలుతో కనుల పండువగా రథయాత్ర సాగింది.



దేవీచౌక్ వద్ద జగన్నాథస్వామి రథయాత్ర దృశ్యం



రథయాత్ర ఆచారంలో భాగంగా..



రథయాత్రలో సాంస్కృతిక ప్రదర్శనలు



వేంకటేశ్వరస్వామి వేషధారణ

సత్యదేవుడి సన్నిధిలో టిడ్కో చైర్మన్ పూజలు



టిడ్కో చైర్మన్‌కు స్వామివారి ప్రసాదం అందజేస్తున్న పీఆర్వో కృష్ణారావు

అన్నవరం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో శుక్రవారం టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ పీఆర్వో కృష్ణారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేయగా పీఆర్వో స్వామివారి ప్రసాదం అందించారు.

రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. అమ్మవారికి చండీ,సప్తపారాయణలు, మూలమంత్రజపములు పఠించారు. పవిత్ర హోమగుండంలో సు గంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. భక్తులకు తీర్థప్రసాదాలందించారు.

ఏపీ పీజీ సెట్‌లో 'ఆదిత్య' విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు

కాకినాడ రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఏపీ పీజీ సెట్-2025 ఫలితాల్లో ఆదిత్య విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు లభించినట్టు డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు తెలిపారు. వివిధ సబ్జెకుల్లో 10లోపు 11 ర్యాంకులను తమ విద్యార్థులు సాధించారన్నారు. రాష్ట్ర స్థాయిలో గణితంలో 1, 3, 5, 5, 8, కంప్యూటర్ సైన్స్‌లో 3, 8, 10, గణాంక శాస్త్రంలో 9, ఎలక్ట్రానిక్స్‌లో 4, 5 ర్యాంకులు సాధించారు. విద్యార్థులను, వారికి శిక్షణనిచ్చిన అధ్యాపకులను ఆదిత్య చైర్మన్ ఎన్.శేషారెడ్డి, కార్యదర్శి ఎన్.సుగుణారెడ్డి, ప్రిన్సిపాల్స్, వైస్ ప్రిన్సిపాల్స్ అభినందించారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్టు

23 కిలోల గంజాయి, కారు స్వాధీనం

కాకినాడ రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం సర్పవరం వసంతనగర్‌లో కారులో తరలిస్తున్న 23 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గు రిని అరెస్టు చేసినట్టు సర్పవరం సీఐ బి.పెద్దిరాజు తెలిపారు. ఎస్ఐ శ్రీనివాస్‌కుమార్, డీటీలు సిబ్బందితో కూడిన బృందం దాడి చేసి చల్లా నాగశివ మణికంఠ, మద్దాల ఉదయకుమార్, ఏనుగుపల్లి రాజుల వద్ద 23 కిలోల గంజాయి ఉన్నట్టు గుర్తించి రవాణాకు ఉపయోగించిన కారును స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు. జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లలో పలు కేసుల్లో వారి ప్రమేయం ఉందన్నారు. ముగ్గురు నిందితులు జ్యుడీషియల్ కస్టడీకి రిమాండ్ చేయగా తప్పించుకున్న నాల్గో నిందితుడిని పట్టుకునేందుకు చర్యలు కొనసాగుతున్నాయని సీఐ బి.పెద్దిరాజు పేర్కొన్నారు.



గంజాయి రవాణా చేస్తూ కారుతో పట్టుబడిన నిందితులు

మన్యంలో ముసురు

మోతుగూడెం-డొంకరాయి మార్గమధ్యంలో నేలకూలిన భారీ వృక్షం

మోతుగూడెం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ముసురు ప్రభావంతో అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెంలో రెండు రోజులుగా వర్షం పడుతూనే ఉంది. దీంతో ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. విద్యార్థులు, నిత్య కూలీలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మోతుగూడెం-డొంకరాయి మార్గమధ్యంలో శుక్రవారం తెల్లవారుజామున ఆర్అండ్‌బీ రహదారిపై భారీ వృక్షం నేలకూలింది. దీంతో వాహనదారుల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో గ్రామస్తులు చేరుకుని చెట్టును పక్కకు తొలగించడంతో వాహన రాకపోకలు యథావిధిగా సాగాయి వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో మోతుగూడెం మన్యంలో వాగులు, జలపాతాలు ఊపిరి పోసుకున్నాయి.



నేలకూలిన భారీ వృక్షం

రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

పర్యాటక రంగ సమగ్రాభివృద్ధికి డీపీఆర్

» ఇకో టూరిజం అభివృద్ధి
» 2027 గోదావరి పుష్కరాల నాటికి అందుబాటులోకి హోం స్టే
» పురుషోత్తపట్నం ఏనుగుకొండ ప్రాంతంలో ఏడు ఎకరాల్లో ఎకో రిసార్ట్స్
» వివిధ శాఖల అధికారులతో సమీక్షలో జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, జూన్27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పర్యాటక రంగం సమగ్ర అభివృద్ధి కోసం సమగ్ర కార్యాచరణ ప్రణాళిక(డీపీఆర్), ఇకో టూరిజంతో కూడిన ప్రణాళిక తక్షణం సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆమె దేవాదాయ, మున్సిపల్ కార్పొరేషన్, కన్సల్టెంట్ ప్రతినిధులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ అఖండగోదావరి ప్రాజెక్టుకు పనులు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రతిపాదించిన అన్ని పనులకు సమగ్ర నివేదిక అందజేయాలన్నారు. గోదావరి పరివాహక ప్రాంతాలలోటెంపుల్, ఇకో, ఇతర అనుబంధ ప్రాంతాలలో పర్యాటక ప్రాంతాలు వివరాలతో సమగ్ర నివేదిక ఇవ్వాలన్నారు. 2027 గోదావరి పుష్కరాల సందర్భంగా రాజమండ్రి గోదావరి ఘాటుల, కొవ్వూరు గోష్పాద క్షేత్రం, ఇతర ఘాట్లు, సినిమా చెట్లు, నిడదవోలు కెనాల్, వాడపల్లి కెనాల్ రహదారి, కడియంపులంక ప్రాంతం, గోదావరి ఐలాండ్, హోంస్టే తదితర విషయాలన్నీ నివేదికలో ఉండాలన్నారు. పోలవరం సమీపంలోని సీతానగరం మండలం పురుషోత్తపట్నంలో ఏనుగుకొండ ప్రాంతంలో ఏడు ఎకరాల్లో ఇకో రిసార్ట్సుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. జిల్లాలో అందుబాటులో ఉన్న మండువాలోగిళ్లు, పురాతన కాలం నాటి భవనాలు, పెంకుటిళ్లను హోం స్టే కోసం గుర్తించి, వాటిని పర్యాటకులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గోదావరి తీరంలో బోటింగ్‌కు అనుకూల వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలు, తమ కుటుంబీకులతో కొంత సమయం ఇక్కడ గడిపేలా అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. సమావేశంలో ఆర్ఎంసీ ఎస్ఈ ఎంసీహెచ్ కోటేశ్వరరావు, ఈఈ మదర్సాఆలీ, జిల్లా టూరిజం అధికారి పి.వెంకటాచలం, ఎండోమెంట్ అధికారులు పాల్గొన్నారు.

జేకే గార్డెన్స్‌లో అంతర్జాతీయ ఎక్స్‌పో



జేకేలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ ఎక్స్ పో

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం జేకే గార్డెన్స్‌లో ఐబీసీఎఫ్ అండ్ సత్య ఏజెన్సీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఎక్స్‌పో ఏర్పాటు చేశారు. ఈ నెల 30 వరకు జరుగునుంది. సత్యకు దేశంలో 350 షోరూమ్‌లు ఉండగా రాష్ట్రంలో 60కి పైబడి ఉన్నాయి. జేకేలో ఏర్పాటు చేసిన ఎక్స్‌పోలో స్మార్ట్ ఫోన్లు, ఓఎల్ఈడీ టీవీలు, వాష్ టవర్స్, మోడరన్ ఫ్రెంచ్ డోర్ రిఫ్రిజిరేటర్లు, కిచెన్ అప్లయిన్స్, మసాజ్ ఛైర్స్, కుట్టుమిషన్ల ప్రదర్శన, అమ్మ కాలు జరుగుతున్నాయి.అలాగే ఎస్ బీ మోటార్స్ ఆటో ఎక్స్‌పో ఉంది. దీనిలో మారుతి, నెక్సా వాహనాలు, ఎమ్ అండ్ ఎన్ మోటార్స్ ధార రాక్స్ ఎక్స్ఈవి9ఈ ఈవీ వాహనాల ప్రదర్శన వుంది. ఈ ఎక్స్‌పో ప్రతి రోజు ఉదయం 10నుంచి రాత్రి 9గంటల వరకు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

దివ్యాంగుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే గోరంట్ల



విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు అందజేసిన గోరంట్ల దంపతులు

ధవళేశ్వరం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అనేక అభివృద్ధి పథకాల అమలు చేస్తుందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు. శుక్రవారం స్థానిక పలుకు బధిరుల ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన బధిరుల మార్గదర్శి హెలెన్ కెల్లర్ జయంతి కార్యక్రమానికి ఎమ్మెల్యే దంపతులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. హెలెన్ కెల్లర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు పెన్షన్‌లు పెంచి అందజేస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రత్యేక అవసరాల పిల్లల కోసం అన్ని సౌకర్యాలతో భవిత కేంద్రాలను ఏర్పాటు చేసిందని, దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలు అందజేసిందని తెలిపారు. ఏఎంసీ చైర్మన్ మార్ని వాసుదేవరావు పుట్టినరోజును విద్యార్థుల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దంపతులు.. విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు అందజేశారు. అనంతరం విద్యార్థులకు భోజనాలు అందించారు.కార్యక్రమంలో పలుకు ఆశ్రమ పాఠశాల నిర్వాహకురాలు గంటా కనకదుర్గ, టీడీపీ నాయకులు రొంపిచర్ల ఆంటోని, పందూరి అప్పారావు, బొప్పన శ్రీను పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చకపోతే ప్రజలే నిలదీస్తారు

వైసీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో రీజనల్ కోఆర్డినేటర్ బొత్స

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చవలసిన బాధ్యత అధికార పక్షానిదేనని, లేకుంటే ప్రజలే నిలదీస్తారని వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ అన్నారు. శుక్రవారం రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు గ్రామంలోని వెంకటాద్రి ఫంక్షన్ హాలులో వైసీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అధ్యక్షతన జరిగిన జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అరచేతిలో స్వర్గం చూపించి ప్రజలను మోసం చేస్తోందని ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతీ వైసీపీ కార్యకర్తపై వుందని, ప్రభుత్వం సక్రమంగా వ్యవహరించకపోతే ప్రజల పక్షాన బాధ్యత తీసుకుని పోరాడవలసిన ఉందని అన్నారు. కూటమి ప్రజాప్రతినిధులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారన్నారు. సూపర్ సిక్స్ అమలు కావడంలేదన్నారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్.. ప్రజలను నమ్మించి మోసం చేశారని బొత్సా ఆరోపించారు. కూటమి తాటాకు చప్పుళ్లకు లొంగేదిలేదని ఏదైనా ప్రజల్లోనే తేల్చుకుందామన్నారు. ఉచిత ఇసుక అని చెప్పి, రూ25 వేలకు లారీ ఇసుక కొనుక్కునే దౌర్భాగ్య స్థితికి తీసుకువచ్చారన్నారు. వైసీపీ నిర్వహించనున్న బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం మూడు అంచెల్లో జరుగుతుందని చెప్పారు. సమావేశంలో మాజీ హోంమంత్రి తానేటి వనిత, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్, పార్లమెంట్ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, నియోజకవర్గ పరిశీలకుడు తిప్పల గురుమూర్తి రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, జి.శ్రీనివాస్ నాయుడు, సత్తి సూర్యనారాయణ రెడ్డి, తలారి వెంకట్రావు, రౌతు సూర్యప్రకాశ రావు, వైసీపీ కేంద్ర కమిటీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, జక్కంపూడి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కట్టిన వాటినే ప్రారంభిస్తూ హంగామా!

మాజీ ఎంపీ మార్గాని భరత్

రాజమహేంద్రవరం కల్చరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో కట్టిన వాటిని ప్రారంభిస్తూ కూటమి నాయకులు హంగామా చేస్తున్నారని మాజీ ఎంపీ, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్ ఎద్దేవా చేశారు. ప్రభుత్వాలు మారినా ప్రభుత్వ కార్యక్రమాలు కొనసాగించడం సహజమని, అయితే ఎవరు కృషి చేశారో కూడా గుర్తించాలన్నారు. స్థానిక మార్గాని ఎస్టేట్‌లోని తమ కార్యాలయంలో ఓ ప్రకటన చేస్తూ హేవలాక్ బ్రిడ్జ్ అభివృద్ధికి తన హయాంలో కృషి చేశానని, శివలింగం పక్కన, ఇటువైపు ఉన్న స్థలం రైల్వేకి సంబంధించినది కావడంతో ప్రత్యామ్నాయంగా వీఎల్ పురంలోని లారీ స్టాండ్ దగ్గరలో 2583.33 చదరపు మీటర్ల భూమిని బదలాయించడానికి ఉత్తర్వులు తెచ్చామని భరత్ పేర్కొన్నారు. దాదాపు 2.3 కిలోమీటర్ల పొడవున్న హేవలాక్ వంతెనకు రోడ్డు వేయడానికి కనీసం 3,4 వందల కోట్లు ఖర్చవుతుందని, గతంలో తాము అంచనా కూడా వేయించామని, అయితే ఇప్పుడు 94 కోట్లు తెచ్చి హేవలాక్ వంతెనకు రోడ్డు వేయిస్తామనడం, ఇంకా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలని చేపడతామనడం వింతగా ఉందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం తెచ్చిన డబ్బు ఏ మూలకు సరిపోతుందని ఆయన ప్రశ్నించారు. చేస్తే సంతోషమే అని వ్యాఖ్యానించారు.

ఆలయంపై వాలిన జమ్మిచెట్టు



రంగంపేటలో దేవాలయంపై వాలిన జమ్మిచెట్టు

రంగంపేట, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రంగంపేటలోని 160 సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీ ఉమా రామలింగేశ్వర, బాలసుబ్రహ్మణేశ్వర స్వాముల దేవస్థానంలో వందేళ్ల నిలిచి ఉన్న జమ్మిచెట్టు శుక్రవారం అకస్మాత్తుగా నేలకొరిగింది. కాగా.. ప్రస్తుతం ఈ దేవాలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభించేందుకు ఆలయ కమిటీ, గ్రామస్థులు సిద్ధవుతున్నారు. అయితే ఆలయంలో ఉన్న జమ్మిచెట్టును ఉంచాలా? తీసేయాలా? నిర్మాణానికి ఏమైనా అడ్డంకులు వస్తాయా? అనే సందేహం వారిలో కలిగింది. భక్తులందరికీ వచ్చిన సందేహాలకు, ఎన్నో ప్రశ్నలకు సమాధానంగా.. 'వాళ్లు నన్ను తీసేటప్పుడు బాధ చూపిస్తారు.. వాళ్లకు ఆ బాధను మిగల్చకూడదు.. నేనే నేలకొరుగుతాను' అంటూ ఈరోజు నేలకొరిగిందేమో అని భక్తులు అంటున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యం

» ఆ దిశగా కమిటీలు పనిచేయాలి
» టీడీపీ అనపర్తి నియోజకవర్గ పరిశీలకుడు అప్పారావు



ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అప్పారావు

బిక్కవోలు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించే దిశగా కమిటీలు సమర్థవంతంగా పనిచేయాలని టీడీపీ నియోజవర్గ ఎన్నికల పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు సూచించారు. బలభద్రపురం ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో శుక్రవారం సంస్థాగత ఎన్నికలు-2025లో భాగంగా గ్రామాల్లో పార్టీని బలోపేతం చేసే దిశగా గ్రామ కమిటీలు, బూత్ లెవెల్ కన్వీనర్, కో కన్వీనర్ల నియామకం కోసం నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో టీడీపీ నేతలు, కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ బూత్ లెవెల్‌లో పార్టీని బలోపేతం చేయడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. త్వరలోనే కమిటీలను పూర్తి చేసి అధిష్ఠానానికి పంపిస్తామన్నారు. మనోజ్ మాట్లాడుతూ టీడీపీ గ్రామ శాఖలో అధ్యక్షుడిగా ఓసీ వర్గం వ్యక్తిని నియమిస్తే, ఎస్సీ లేదా బీసీల వర్గాల వ్యక్తులను ఉపాధ్యక్షులు లేక ప్రధాన కార్యదర్శిగా నియమించాలని పార్టీ ఆదేశించిందన్నారు. బూత్ లెవెల్‌లో వున్న సమస్యలు తెల్సుకుని పరిష్కరించేందుకు కమిటీలను నియమిస్తున్నట్టు చెప్పా రు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎన్నికల పరిశీలకుడు నాదెండ్ల శ్రీరామ్‌చౌదరి, 4 మండలాల పరిశీలకులు ఆంద్రు అనిల్, రొంగల సత్యనారాయణ, లంక సత్యనారాయణ, టి.సత్యనారాయణ, నాయకులు తమలంపూడి సుధాకర రెడ్డి, సిరసపల్లి నాగేశ్వరావు, కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, జుత్తుగ కృష్ణ, వెలుగుబంట్ల సత్తిబాబు, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, పాలచర్ల చౌదరి, ఆళ్ల గోవిందు, కర్రి శేషారత్నం పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలను భవితలో చేర్పించండి

» సమగ్ర శిక్ష జిల్లా సహిత సమన్వయకర్త కనకబాబు
» రాజానగరం, రంగంపేట కేంద్రాల సందర్శన



రాజానగరంలో రికార్డులు పరిశీలిస్తున్న కనకబాబు

రాజానగరం/రంగంపేట, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను తల్లిదండ్రులు భవిత కేంద్రాల్లో చేర్పించాలని సమగ్ర శిక్ష జిల్లా సహిత విద్య కోఆర్డినేటర్ కనకబాబు పేర్కొన్నారు. ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా రాజానగరంలోని ప్రాథమిక పాఠశాలలోని ప్రత్యేకవసరాల విద్యార్థుల భవిత కేంద్రాన్ని, రంగంపేటలోని భవిత కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల శారీరక దృఢత్వం కోసం ప్రతి మంగళవారం రాజానగరం మండల విద్యాశాఖ కార్యాలయంలో ఫిజియోథె రఫీ క్యాంపు జరుగుతుందని, ఈ క్యాంపును అందరూ సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులను కోరారు. ఇప్పటి వరకు దివాన్‌చెరువు పాఠశాలలో కొనసాగేదని, ప్రత్యేక అవసరాల విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని దీనిని రాజానగరంలోని నెంబర్-1 పాఠశాలకు మార్చినట్లు కనకబాబు చెప్పారు. కార్యక్రమంలో ఎంఈవో రామన్నదొర, ఐఆర్‌టీ సరేష్ పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులను పరిశీలించి, ప్రతిభా పాటవాలు అభివృద్ధిని, రికార్డుల నిర్వహణను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే టీఎల్ఎం కిట్లు, ట్యాబ్‌ల వినియోగం, విద్యార్థుల నమోదు, హాజరు నిలకడలో కృషి చేస్తున్న కేంద్ర నిర్వాహకులు, ఐఈఆర్టీలు ఎంవీఎస్ ప్రసాద్, జి.అంజలి కృషిని ఆయన అభినందించారు. ఈ సందర్భం గా రికార్డులను, విద్యాబోధనను కన్నబాబు పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఎంఈవో పి.మధుసూదనరావు, సీఆర్ఎంటీ ఎల్.శ్రీనివాస రాజు తదితరులు పాల్గొన్నారు. కాగా శుక్రవారం బధిరుల మార్గదర్శి హెలెన్ కెల్లర్ జయంతి.. అయితే రాజానగరం, రంగంపేట భవిత కేంద్రాలను సందర్శించిన కోఆర్డినేటర్ కనకబాబు హెలెన్ కెల్లర్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించకపోవడం, దాని గురించి ప్రస్తావించకపోవడం గమనార్హం.

శాస్త్రీయ పద్ధతుల్లో ఎరువులు వినియోగించాలి

వ్యవసాయాధికారి భీమరాజు



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి భీమరాజు

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సాగు ప్రారంభమైన నేపథ్యంలో రైతులు పంటల దిగుబడి పెంపు కోసం శాస్త్రీయ పద్ధతుల్లో ఎరువులు వినియోగించాలని మండల వ్యవసాయాధికారి భీమరాజు అన్నారు. మండలంలోని తొర్రేడు వ్యవసాయ సొసైటీలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజను ముందుగానే మట్టి పరీక్షలు చేయించుకొని దాని నివేదిక ఆధారంగా ఎరువుల మోతాదును నిర్ణయించుకోవాలన్నారు. వ్యవసాయాధికారుల సలహాలతో సరైన దశలో సరైన మోతాదులో మాత్రమే ఎరువుల వాడాలన్నారు. యూరియా విడివిడిగా రెండు లేదా మూడు దశల్లో వేయడం మంచిదన్నారు. మట్టిలో వుండే పోషకాలను బట్టి నైట్రోజన్, పాస్పరస్, సూక్ష్మపోషకాలు అవసరమైతే తప్ప వాడకూడదన్నారు. సేంద్రీయ ఎరువులు వినియోగం పెంచడం తద్వారా నేలలో జీవన శక్తి పెరుగుతుందని రసాయన ఎరువుల అవసరం ఉండదని జిల్లా సహకార అధికారి ఎం.వెంకటరమణ అన్నారు. కార్యక్రమంలో ఆడిట్ అధికారి జగన్నాథరెడ్డి, సహకార అధికారి కనకదుర్గ, సొసైటీ సీఈవో కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

కుతుకులూరులో ఇంటి వద్దకే రేషన్‌పంపిణీ



వృద్ధురాలికి ఇంటి వద్దనే రేషన్ అందజేస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): వృద్ధులు, దివ్యాంగులు, విభిన్న ప్రతిభావంతులకు మేలు చేకూర్చాలన్న లక్ష్యంతోనే నెలలో ఐదు రోజుల ముందుగా ఇంటి వద్దనే రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం చేపట్టిందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని కుతుకులూరులో ఇంటి వద్దకే రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ముందుగా డీలర్ల ఆధ్వర్యంలో దివ్యాంగులు, వృద్ధుల ఇళ్లకు వెళ్లి రేషన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రేషన్ పంపిణీ విధానంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించేందుకు మార్పులు తీసుకొచ్చినట్టు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనిల్‌కుమార్, సర్పంచ్ గొల్లు హేమతులసి, రామవరం మాజీ సర్పంచ్ తేనెల శ్రీనివాస్, డీసీ చైర్మన్ వెంకట సుబ్బారెడ్డి, కూటమి నాయకులు కర్రి చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు

పూలే అంబేడ్కర్ భవనం భవిష్యత్ తరాలకు ఆదర్శం

మొదటి అంతస్తు ప్రారంభోత్సవంలో ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం గోదావరి బండ్ రోడ్డులో ట్రాన్స్‌కో కార్యాలయం పక్కన నిర్మించిన పూలే అంబేడ్కర్ భవనం భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలుస్తుందని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. రూ.4.33 కోట్ల వ్యయంతో నిర్మించిన పూలే అంబేడ్కర్ భవనం ప్రారంభోత్సవం శుక్రవారం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో జరిగింది. దీనికి ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, ఎమ్మెల్సీ సోమువీర్రాజు ముఖ్యఅతిథులుగా విచ్చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో పురందేశ్వరి మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం తమ జీవితాలను త్యాగం చేసిన మహనీయుల పేర్లు మాత్రమే నామకరణం చేయాలని ఈ భవనానికి పూలే అంబేడ్కర్ భవనంగా పేరు పెట్టారన్నారు. జ్యోతిరావు పూలే తన జీవితాన్ని బీసీకుల అభ్యున్నతికి అంకితం చేశారన్నారు. రివర్‌ఫ్రంట్ వ్యూ నిర్మాణంలో మహనీయులు విగ్రహాలకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా వాటిని యథాస్థానంలో పెడతామన్నారు. ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ నగరంలో ఇంటువంటి కమ్యూనిటీ హాళ్ల పేదలు పెళ్లిలు, శుభకార్యాలు, ఇతర సమావేశాలు నిర్వహించుకోవడానికి అనువుగా ఉంటుందన్నారు. సచివాలయ వ్యవస్థను సర్దుకుంటూ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ తీసుకురానున్నట్టు చెప్పారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ వెనుకబడిన తరగతుల సామాజిక వర్గాల వారికి సంబంధించి ఇటువంటి కమ్యూనిటీ భవనాలను నిర్మిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ముంపులో గ్రామసభలు నిర్వహించాలి

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా జూలై 1న ముంపు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి పీఎస్ఎస్ భూములకు పరిహారం నిర్ధారించాలని ఆదివాసీ మహాసభ న్యాయసలహాదారుడు అయినాపురపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీ ప్రభుత్వం 2013లో జీవో ఎంఎస్ నెం.791 ప్రకారం జూలై 1న అధికారులు గ్రామ సభలు నిర్వహించాలన్నారు. సమయం దగ్గర పడుతున్నప్పటికీ గ్రామస్థులకు సంబంధిత అధికారుల నుంచి ఎటువంటి సమాచారం లేదన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చొరవ తీసుకుని గ్రామ సభలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

వారాహి మాతకు ఎమ్మెల్యే పూజలు

కొవ్వూరు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు బ్రిడ్జిపేటలో వారాహి అమ్మవారి ఆలయానికి భక్తులు శుక్రవారం పోటెత్తారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కంటమణి రామకృష్ణారావు, సూరపనేని చిన్ని సహా పలువురు నాయకులు, పట్టణ, పరిసర ప్రాంతాల నుంచి మహిళలు అమ్మవారిని దర్శించుకున్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ఎస్కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల్లో గెస్ట్‌ఫ్యాకల్టీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని కళాశాల ప్రిన్సిపాల్ బీవీ తిరుపణ్యం తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ అభ్యర్థులు తమ బయోడేటా ఫారంతోపాటు విద్యార్హతల సర్టిఫికెట్లు జత చేసి జులై 3వ తేదీలోగా కళాశాల ఈ-మెయిల్‌కు పంపించాలని తెలిపారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, కంప్యూటర్ సైన్స్ అభ్యర్థులకు 4వ తేదీన, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, కామర్స్ అభ్యర్థులకు 5వ తేదీన ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు.

విద్యార్థులకు బ్యాగ్‌ల అందజేత

రాజానగరం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి విడుదలైన సర్వేపల్లి రాధాకృష్ణ కిట్లను రాజానగరం హైస్కూల్లోని విద్యార్థులకు కూటమి నాయకులు శుక్రవారం పంపిణీ చేశారు. దీనిలో భాగంగా స్కూల్ బ్యాగులు, పుస్తకాలు, బూట్లను విద్యార్థులకు అందజేశారు. అనంతరం 458 మంది విద్యార్థులకు స్థానిక జనసేన నాయకుడు సైతిన చల్లారావు పెన్నులు బహూకరించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలన సామాజిక బాధ్యత

టీబీ సూపర్‌వైజర్ సత్యనారాయణ మూర్తి

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : క్షయవ్యాధి నిర్మూలన ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని టీబీ సూపర్‌వైజర్ కేవీవీ సత్యనారాయణ మూర్తి అన్నారు. శుక్రవారం రాజమహేంద్రవరంలోని బృహన్నల పేట అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో టీబీ నిర్మూలన ప్రచార కార్యక్రమం నిర్వహించారు. టీబీ ముక్త భారత్ అందరి నినాదం కావాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో టీబీ హెచ్‌వీ కె.శైలజ, ఎల్‌టీ లక్ష్మి, ఏఎన్ఎం పి.బుజ్జమ్మ, ఆశాలు పాల్గొన్నారు.

మానసిక రోగులపై దయ చూపాలి


డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి

రాజమహేంద్రవరం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మానసిక రోగులపై దయ చూపాల్సిన అవసరం ఉందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీలక్ష్మి పేర్కొన్నారు. మానస, హరిత మానసిక వైద్య ఆస్పత్రులను ఆమె శుక్రవారం సందర్శించారు. పూర్తిగా ఉపశమనం పొందిన వారిని వారి కుటుంబ సభ్యుల చెంతకు చేర్చడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో ఎలాంటి న్యాయ సహాయం అవసరమైనా డీఎల్ఎస్ఏని సంప్రదించాలన్నారు. రోగులు, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వైద్యం, సదుపాయాలపై ఆరా తీశారు.

జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవాలి


9వ అదనపు జిల్లా జడ్జి అనురాధ

కొవ్వూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌లో ఇన్సూరెన్సు కేసులను ఎక్కువ సంఖ్యలో రాజీ చేసుకోవాలని కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి ఎం.అనురాధ అన్నారు. శుక్రవారం ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు, ఇన్సూ రెన్సు కేసులు చూసే న్యాయవాదులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూలై 5వ తేదీన నిర్వహించే లోక్ అదాలత్‌లో రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా కక్షిదారులకు సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. కార్యక్రమంలో ఇన్సూరెన్సు కంపెనీ న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.



నన్నయ వర్శిటీలో పీజీ అడ్మిషన్లు

దివాన్‌చెరువు, జూన్27 (ఆంధ్రజ్యోతి) : ఏపీ పీజీ సెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు నన్నయ వర్శిటీ పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. వర్శిటీలోని వీసీ కార్యాలయంలో ప్రవేశాలకు సంబంధించిన బ్రోచర్‌ను శుక్రవారం ఆవిష్కరించి మాట్లాడారు. నన్నయ వర్శిటీ రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్‌లలో ఆర్ట్స్ అండ్ కామర్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగాల్లో పీజీ కోర్సులు అందిస్తున్నామన్నారు. కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌లో అర్హత సాధించిన వారికి ప్రవేశం లభిస్తుందన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థు లు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌ను లేదా 70930 08477 నెంబరును సంప్రదించాలని తెలిపారు. అడ్మిషన్‌ల ప్రక్రియను డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఆచార్య పి.ఉమామహేశ్వరీదేవి, అసోసియేట్ డైరెక్టర్ ఎన్.సజనారాజ్ నిర్వహిస్తారన్నారు.



అవినీతి ఆరంభం : కాకినాడ జిల్లా కొమరగిరిలో జగనన్న ఆరంభించిన లేఅవుట్

నేతలు.. మహా మేతలు!

అతి పెద్ద స్కామ్ ఇక్కడే..

అతిపెద్ద స్కాం కొమరగిరి లేఅవుట్‌లోనే ఉన్నట్టు విజిలెన్స్ నిర్ధారించింది. అప్పట్లో సీఎం జగన్ ఇక్కడి నుంచి పేదల ఇళ్ల పథకం ప్రారంభించడంతో లోతట్టుగా ఉన్న 350 ఎకరాల కొమరగిరి భూములు చదునుకు రూ.125 కోట్ల వరకు వెచ్చించింది. ఈ పనులు అప్పటి కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చేశారు. గ్రావెల్‌ను పోలవరం కాలువలు, పెద్దాపురం రామేశంమెట్ట నుంచి తరలించేశారు. అధికారులేమో అడ్డగోలుగా రూ.35 కోట్ల వరకు బిల్లులు ఇచ్చేశారు. దీనిపై అప్పట్లో ముఖ్యమంత్రి అదనపు కార్యదర్శి రేవు ముత్యాల రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. లేఅవుట్ చదునుకు ఎకరాకు కనీసం రూ.15 లక్షల్లోపు చేయాల్సి ఉన్నా రెట్టింపు బిల్లులు ఇవ్వడంపై అనుమానాలు వ్యక్తం చేసినా చర్యల జోలికి వెళ్లలేదు. విచారణ బృందాలు ఈ అక్రమాలు తవ్వనున్నాయి.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

నేతలు.. మేతలు.. పేదల ఇళ్ల స్థలాల ముసుగులో గత వైసీపీ ప్రభుత్వంలో కొందరు నేతలు, అధికారులు ఒకటి కాదు రెండు కాదు.. వందల కోట్లు మెక్కేశారు. అంచనాలు అడ్డంగా పెంచేసి.. కోట్లలో బిల్లులు నొక్కేసి ఖజానాకు పంగనామాలు పెట్టారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 1600 లేఅవుట్లలో సుమారు 19 వేల ఇళ్ల స్థలాల కేటాయింపు, ఇతర విషయాలలో అవకతవకలు జరిగినట్టు అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. ప్రభుత్వం ఇప్పుడు అవినీతి డొంక కదల్చడానికి నేరుగా రంగంలోకి దిగింది. డ్వామా ఏపీడీలు, రాజధాని నుంచి పంపిన నరేగా క్వాలిటీ కంట్రోల్ అధికారులతో కలిసి ప్రత్యేక బృందాలతో వేట మొదలుపెట్టింది.

కాకినాడలో 324 లేఅవుట్లు..

కాకినాడ జిల్లాలో గత వైసీపీ ప్రభుత్వం 3,84,218 మంది లబ్ధిదారులను ఇళ్ల స్థలాలకు గుర్తించింది. 7,218 ఎకరాలు కావాల్సి ఉండగా 1,856 ఎకరాల ప్రభుత్వ భూమిపోను 5,362 ఎకరాలను రూ.2,566 కోట్లతో రైతుల నుంచి కొనుగోలుచేసింది. 2020 డిసెంబరు 25న అప్పటి సీఎం జగన్ కొమరగిరి వచ్చి తొలిసారిగా ఇళ్ల స్థలాల పథకం ప్రారంభించారు. అలాగే జిల్లావ్యాప్తంగా 324 లేఅవుట్లలో పేదలకు స్థలాలు కేటాయించారు. ప్రభుత్వం మారగానే జగనన్న లేఅవుట్లలో అక్రమాలపై విజిలెన్స్ అధికారులు దృష్టిపెట్టారు. 80 శాతం లేఅవుట్లలో భారీ అవినీతి జరిగిందని నిర్ధారించారు. కాకినాడ జిల్లాలో రూ.321 కోట్ల రెట్టింపు అంచనాలతో 152 లేఅవుట్లలో చేసిన పనులపై విచారణకు ఆదేశించింది. మరో 121 లేఅవుట్లలో పెండింగ్‌లో ఉన్న రూ.42 కోట్ల బిల్లుల అవినీతిపైనా దృష్టి పెట్టింది. 324 లేఅవుట్లలో చదును చేసిన రూ.650 కోట్ల బిల్లుల లెక్క తేల్చబోతోంది.

తూర్పున మెక్కేశారు!

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

తూర్పుగోదావరి జిల్లాలోనూ పేదల ఇళ్ల స్థలాల పేరుతో కోట్లలో మెక్కేశారు. అవినీతి లెక్కతేల్చడానికి రాజమండ్రి రీజియన్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ స్నేహిత ఆధ్వర్యంలో అధికారులు రంగంలోకి దిగారు. ఈ మేరకు 4 బృందాలు ఏర్పాటుచేశారు. 324 లేఅవుట్లకు సంబంధించి రూ.6.6 కోట్లు అవకతవకలు జరిగినట్టు నిర్ధారించారు. రెట్టింపు అంచనాలకు సంబంధించి 7 మండలాల్లో 22 కోట్లు అవకతవకలు జరిగినట్టు తేల్చారు. లోతట్టు ప్రాంతాల్లో నిబంధనల మేరకు ఫిల్లింగ్ చేయకుండా వదిలేసిన కొన్ని ఇళ్లను గుర్తించారు. ఇళ్ల స్థలాల కోసం కొనుగోలు చేసిన భూముల్లో జరిగిన అవకతవకలపై విచారణ చేస్తున్నారు.

కోరుకొండ మండలం బూరుగుపూడి, మధురపూడి తదితర ప్రాంతాల్లో పనికిరాని ఆవ భూములకు ఎకరానికి రూ.43 లక్షల వంతున చెల్లించి అవకతవకలకు పాల్పడిన సంగతి తెలిసిందే. దీనిపైనా విచారణ జరుగుతోంది. ఆవ భూమిలో సుమారు 6 మీటర్ల లోతు వరకూ నీరు నిలిచిపోతుందని.. ఇది నివాస యోగ్యం కాదని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. అసలు రైతుకు ఎంత ఇచ్చారు. అప్పట్లో అక్కడ మార్కెట్ విలువ ఎంత? ఎంత ఎక్కువ చెల్లించారు. ఎవరెవరి ప్రమేయం ఇందులో ఉందనే తదితర అంశాలపై నిశితంగా విజిలెన్స్ అధికారులు ఆరా తీస్తున్నారు. త్వరలో అవకతవకల నిగ్గుతేల్చి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నారు.

పేదల ముసుగు..పెద్దల లోసుగు

- జగనన్న లేఅవుట్లలో భారీ అవినీతి
- ప్రత్యేక బృందాలతో విచారణ
- అడ్డగోలు చెల్లింపులపై ఆరా
- రూ.70 కోట్లు బిల్లుల పెండింగ్
- వేట ఆరంభించిన ప్రభుత్వం
- లేఅవుట్లలో 80 శాతం అక్రమాలే
- వెలుగు చూస్తున్న వైనం

డొంకంతా కదలాల్సిందే..

విజిలెన్స్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) అధికారులు పంపిన నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రత్యేక బృందాలను నియమించింది. అక్రమాలు భారీగా ఉన్న లేఅవుట్లలో ఎంతమేర నిధులు మెక్కేశారో తేల్చాలని నిర్ణయించింది. విచారణను రెండు భాగాలుగా విభజించింది. తొలి భాగం కింద జరిగిన పనుల పెండింగ్ బిల్లులకు సంబంధించి అక్రమాలపై విచారణ చేపడతారు. ఈ తరహా జిల్లాలో 121 లేఅవుట్లను గుర్తించారు. చదును, రహదారులు, డ్రైన్లు, మంచినీరు తదితర పనులకు రూ.120 కోట్ల వరకు ఇదివరకే చెల్లించగా ఇంకా రూ.42 కోట్లు బాకీలు చూపిస్తున్నారు. ఆయా లేఅవుట్లను తనిఖీ చేస్తున్నారు. రెండో అవినీతి కింద అనేక లేఅవుట్లలో అవసరం లేకున్నా ఒక్కో లేఅవుట్‌లో రూ.5 నుంచి రూ.10 కోట్ల వరకు కాకిలెక్కలతో బిల్లులు చేసుకుని డబ్బులు కాజేశారు. జిల్లాలో 17 మండలాల్లో 152 లేఅవుట్లకు రూ.321 కోట్ల వరకు వ్యయ అంచనాలు చూపించారు. ఎకరాకు రూ.25 లక్షలకుపైగా చదును బిల్లులు చూపించి కోట్లలో డబ్బులు కొట్టేశారు. ఒక్క కాకినాడ జిల్లాలోనే 324 లేఅవుట్లలో చదునుకు సంబంధించి రూ.650 కోట్ల వరకు బిల్లులు అప్పట్లో చెల్లించగా ఇందులో రూ.220 కోట్ల వరకు తప్పుడు బిల్లులే ఉన్నట్టు ప్రభుత్వం అనుమానిస్తోంది.

కోనసీమలోనూ..కుమ్మేడే

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వంలో పేదలకు ఇళ్ల నిర్మాణం పేరుతో వేసిన లేఅవుట్లలో ఫిల్లింగ్ అక్రమాలపై ప్రభుత్వం విచారణ చేపట్టింది. జిల్లాలోని నీటి యాజమాన్య సంస్థకు చెందిన ముగ్గురు ఏపీడీలు, అమరావతి నుంచి వచ్చే నరేగా క్వాలిటీ కంట్రోల్ టీమ్ సభ్యులతో మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా 111 లేఅవుట్లలో 241 పనులకు సంబంధించి రూ.21 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్టు సమాచారం. వీటితోపాటు గతంలో చేసిన, చేయని పనులకు కూడా భారీగా నిధులు డ్రా చేశారనే ఆరోపణలున్నాయి. ఈ మేరకు టీడీపీ కూటమి ప్రభుత్వం పెండింగ్ బిల్లులకు సంబంధించిన పనులను పర్యవేక్షించేందుకు క్వాలిటీ కంట్రోల్ టీమ్‌లు రంగంలోకి దింపింది. ఈ టీమ్‌లు గత ప్రభుత్వ హయాంలో జరిగిన పనులను పరిశీలించి ప్రభుత్వానికి నివేదికలు ఇవ్వనున్నాయి. పెండింగ్ బిల్లులతోపాటు గతంలో కాలనీల్లో జరిగిన అక్రమాలపై ఈ బృందం విచారణ జరుపుతున్నట్టు సమాచారం.



చిన్నారులు..గ్రాడ్యుయేట్లు!

అంగన్వాడీ చిన్నారుల గ్రాడ్యుయేషన్ గురించి ఎప్పుడైనా విన్నారా.. వినడమెందుకు ఇదిగో చూడండి.. రాజమహేంద్రవరంలో శుక్రవారం అంగన్వాడీ చిన్నారుల గ్రాడ్యుయేషన్ జరిగింది. అంగన్వాడీ ముగించుకుని ఒకటవ తరగతిలో చదువుకునేందుకు వెళుతున్న చిన్నారులకు ఎంపీ.పురందేశ్వరి, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, కలెక్టర్ ప్రశాంతి, ఇతర అధికారుల సమక్షంలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమం ఆకట్టుకుంది. - రాజమహేంద్రవరం అర్బన్



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్ షర్మిల చిత్రంలో గిడుగు రుద్రరాజు, హర్షకుమార్, విశ్వేశ్వరరెడ్డి తదితరులు

రాష్ట్రానికి కాంగ్రెస్ పాలన అవసరం

పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి కాంగ్రెస్ పాలన అవసరమని పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం షర్మిల, ఏపీసీసీ ఇన్‌చార్జి పాలక్ వర్మతో కలిసి రాజమహేంద్రవరం కృష్ణసాయి కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రాన్ని బీజేపీ దారుణంగా మోసం చేసిందన్నారు. విభజన హామీల్లో ఒక్కటీ అమలు కాలేదన్నారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించి మోసం చేశారన్నారు. 45 మీటర్ల నుంచి 41కి ఎత్తు తగ్గిస్తే అది ప్రాజెక్టు ఎలా అవుతుందని ప్రశ్నించారు. రాష్ట్రంలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ మోదీకి ఊడిగం చేస్తున్నారని, పార్టీలన్నీ గులాం గిరి చేస్తున్నాయన్నారు. విభజన హామీల్లో ఒకటైన రాజధానిని కేంద్రమే నిర్మించి ఇవ్వాలని, కానీ అప్పు ఇచ్చిందన్నారు. అభివృద్ధిని పక్కన పెట్టి యోగా చేసి ప్రధాని వెళ్లిపోయారని, యోగాపై ఉన్న శ్రద్ధ రాష్ట్ర అభివృద్ధిపై లేదన్నారు. దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలని, రాహుల్‌గాంధీ ప్రధాని కావాలన్నారు.రానున్న నాలుగేళ్లు అత్యంత కీలకమని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి జిల్లా పర్యటనలు, విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. రాజమహేంద్రవరం పర్యటనకు వచ్చిన షర్మిలకు జిల్లా కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. గోకవరం బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం సీతంపేట వాటర్ ట్యాంక్‌ల వరకు గుర్రంబండిపై ఊరేగింపు జరిపారు.అక్కడ రాజీవ్‌గాంధీ పార్కులో దివంగత ప్రధాని ఇందిరా గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు.సమావేశంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి, ఏఐసీసీ నేత గిడుగు రుద్రరాజు, మాజీ కేంద్ర మంత్రి పల్లంరాజు, మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్, డాక్టర్ వడయార్ తదితరులు పాల్గొన్నారు.

'తల్లికి వందనం' ఆందోళన వద్దు

9,361 అర్జీలకు పరిష్కారం : కలెక్టర్

రాజమహేంద్రవరం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : 'తల్లికి వందనం' పథకం నగదు జమ కాని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం 'తల్లికి వందనం' పథకంపై సమీక్షించారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో అర్జీలు ఇస్తే వాటిని పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ అందిన అర్జీల్లో 9,361 పరిష్కరించి 2865 మందికి నగదు చెల్లింపు కూడా చేశామన్నారు. మరో 6496 మందికి త్వరలోనే చెల్లింపులు ఉంటాయన్నారు. నవశకం పోర్టల్ మార్గదర్శకాలను అనుసరించి ఇంకా 6,431 అర్జీలు పరిశీలనలో ఉన్నాయన్నారు. పథకానికి ఎంపిక కానివారు గ్రామ, వార్డు సచివాలయాల్లో సరైన ధ్రువ పత్రాలు సమర్పించి అర్జీలు ఇస్తే ప్రభుత్వ వెబ్ పోర్టల్ కూడా సరిచేస్తామని చెప్పారు.



శాప్ డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్‌కు సన్మానం చేస్తున్న మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డి, ఎంపీ కేశినేని చిన్ని

శాప్ డైరెక్టర్ రవీంద్రనాథ్ ప్రమాణస్వీకారం

దేవరపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర శాప్ డైరెక్టర్‌గా పేరం రవీంద్రనాథ్ శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. దేవరపల్లి గ్రామానికి చెందిన రవీంద్రనాథ్ రామన్నపాలెం ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర శాప్ డైరెక్టర్‌గా నియమిస్తూ గతంలోనే ఉత్తర్వులిచ్చింది. రవీంద్రనాథ్‌ను క్రీడాశాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని సత్కరించారు. రవీంద్రనాథ్ గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో శాప్ డైరెక్టర్‌గా విధులు నిర్వహించారు. ఎందరో విద్యార్థులను జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దారు. రెండో సారి శాప్ డైరెక్టర్‌గా అవకాశమిచ్చిన సీఎం చంద్రబాబు , కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ ఏడాది చివరికి టిడ్కో గృహాలిస్తాం



టిడ్కో చైర్మన్ అజయ్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు

- గృహాలకు వైసీపీ హయాంలో డ్యామేజ్
- బాగు చేయించడానికే రూ.4 వేల కోట్లు
- టిడ్కో చైర్మన్ అజయ్‌కుమార్

కొవ్వూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది చివరినాటికి లక్ష టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ తెలిపారు. అన్నవరం వెళుతూ మార్గమధ్యంలో మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు నివాసానికి వెళ్లారు. వైసీపీ ప్రభుత్వం టిడ్కో గృహాలకు చేసిన డ్యామేజీ సంవత్సరంలో పూరించేది కాదన్నారు. టిడ్కో లబ్ధిదారుల పేరు మీద తీసుకున్న రుణాలకు సంబంధించి 2025 మే 31 వరకు బ్యాంకులకు చెల్లించాల్సిన ఇన్‌స్టాల్‌మెంట్స్ బకాయిలు జూన్ నెలాఖరు నాటికి దశలవారీగా రూ.185 కోట్లు ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. ఇటీవల కాకినాడ కలెక్టర్ జిల్లాకు సంబంధించి మొత్తం చెల్లించామని తెలియజేశారన్నారు. లబ్ధిదారులకు ఈ ఏడాదిలోనే గృహాలను అప్పగించాలని ఆలోచన చేస్తున్నామన్నారు. ముందుగా 365, 430 చదరపు అడుగుల గృహాలను ఇస్తామన్నారు. ఒక్కొక్క ఇంటికి రూ.60 వేల నుంచి రూ.70 వేలు మళ్లీ అదనంగా ఖర్చు చేయాల్సి వస్తుందన్నారు. సుమారు రూ.4 వేల కోట్లు ఖర్చవుతుందన్నారు. ఇప్పటికి ప్రభుత్వం రూ.16,250 కోట్లు ఖర్చు చేసిందన్నారు. అంత ఖర్చుచేసిన గృహాలను గత ఐదేళ్లు నిరుపయోగంగా వదిలేయడం బాధాకరమన్నారు. గతంలో టిడ్కో గృహం మంజూరై ప్రస్తుతం వయసు పరిమితి దాటిన వారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా (కో అప్లికెంట్) వారి పిల్లలకు ఇల్లు అందించేలా ఇప్పటికే ప్రభుత్వం జీవో విడుదల చేసిందన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి జనసేనాని పవన్ కల్యాణ్ ఆవిరళ కృషే కారణమన్నారు.పదవులు రాలేదని పార్టీ నుంచి బయటకు వెళ్లిన వారు చరిత్రహీనులుగా మిగిలిపోతారన్నారు. రెండు నెలల్లో పార్టీ కమిటీలు నియమించడం జరుగుతుందన్నారు.స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్న తరుణంలో పార్టీని మరింత బలోపేతం చేసుకోవాలన్నారు.కార్యక్రమంలో జనసేన కొవ్వూరు ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే టి.వి. రామారావు, నామాన బూరయ్య, సిద్ధా రామకృష్ణ, కల్లూరి సుబ్రహ్మణ్యం, చేవ్వూరి రాము, రాగు వీర్రాజు, బోడెం వెంకట సుబ్రహ్మణ్యశర్మ, విజయభాస్కర్, తాతారావు, ఊలపల్లి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అనాథల సంక్షేమానికే పీఎం కేర్ పథకం



పీఎం కేర్ అందుకుని మాట్లాడుతున్న సుమామణి

- వివాహిత సుమామణికి తొలి సాయం
- రూ.10 లక్షల చెక్ అందజేసిన ఎంపీ

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : కొవిడ్ సమయంలో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మిగిలిన పిల్లల సంక్షేమానికి ప్రధాని మోదీ పీఎం కేర్ పథకాన్ని ప్రవేశపెట్టారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. రాజమహేంద్రవరం పోలీస్ కన్వెన్షన్ హాలులో శుక్రవారం ఐసీడీఎస్ నిర్వహించిన కార్యక్రమంలో దేశంలోనే మొట్టమొదటి పీఎం కేర్ ఆర్థిక సహాయం రూ.10 లక్షల చెక్కును బొబ్బిల్లంకకు చెందిన ఎస్.సుమామణికి అందజేశారు. కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామానికి చెందిన సుమామణి తల్లిదండ్రులు మృత్యువాతపడ్డారు. దీంతో అనాథగా మిగిలింది. అనంతరం సీతానగరం మండలం బొబ్బిల్లంకకు చెందిన యువకుడిని వివాహం చేసుకుని అక్కడే నివసిస్తున్నారు.ఆమె పీఎం కేర్ పథకానికి ఎంపిక కాగా శుక్రవారం ఎంపీ పురందేశ్వరి రూ.10 లక్షల చెక్ అందజేసి మాట్లాడారు. మానవసేవే మాధవసేవ అనే సూక్తికి ఉదాహరణ పీఎం కేర్ పథకం అన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ పీఎం కేర్ గొప్ప పథకమని అన్నారు.ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ కొవిడ్ బాధితులకు పీఎం కేర్ అందించడం అభినందనీయమన్నారు.కార్యక్రమంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు, కలెక్టర్ ప్రశాంతి,ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, అర్బన్ సీడీపీవో నర్సమ్మ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అనపర్తిలో వైసీపీకి షాక్



విజయవాడలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా ఆధ్వర్యంలో అనపర్తి ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు

- టీడీపీలోకి ఎంపీపీ, వైస్ ఎంపీపీ
- అదే బాటలో నలుగురు ఎంపీటీసీలు

అనపర్తి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : అనపర్తిలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. వైసీపీ ఎంపీపీ, వైస్ ఎంపీపీ, నలుగురు ఎంపీటీసీలు శుక్రవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. విజయవాడ కుంచనపల్లిలోని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అనపర్తి వైసీపీకి చెందిన ఎంపీపీ అనసూరి సూర్యనారాయణ(బుజ్జి), ఎంపీటీసీ పద్మావతి, కుతుకులూరు ఎంపీటీసీ, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పులగం బులిరెడ్డి, రామవరం ఎంపీటీసీలు నల్లమిల్లి భాగ్యలక్ష్మి, గొలుగూరి గౌతమి, పెడపర్తి ఎంపీటీసీ తమలంపూడి మణిలకు రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై టీడీపీలో చేరామన్నారు.వీరి వెంట సత్తి దేవదానరెడ్డి, తేనెల శ్రీనివాస్, కర్రి చిన్నారెడ్డి, నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి ఉన్నారు.



ఊరేగిన.. జగన్నాథుడు

రాజమహేంద్రవరం కల్చరల్ జూన్ 27 (ఆంధ్రజ్యోతి):జగన్నాథుడి రథయాత్ర శుక్రవారం అంగరంగ వైభవంగా సాగింది.. ఎక్కడికక్కడ భక్తులు హారతులు పట్టగా స్వామి రథం ముందుకు కదలింది..రాజ మహేంద్రవరం ఇస్కాన్ మందిరం నుంచి దేవిచౌక్ మీదుగా ర్యాలీ సాగింది. వేలాది మంది భక్తులతో జగన్నాథస్వామి రథ యాత్ర శోభాయమానంగా జరిగింది. శ్యామలానగర్ రామాలయం సెంటర్ నుంచి ప్రారంభమైన యాత్రలో శ్రీ జగన్నాథ బలదేవ సుభద్రల మూలవిరాట్‌ను ప్రతిష్ఠించారు.బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ విచ్చేసి హారతిచ్చారు. ఇస్కాన్ మందిర కమిటీ ముఖ్య సభ్యుడు సత్యగోపీనాథ్ దాస్ ప్రసాదాలు అందజేశారు. అనంతరం రథయాత్రకు శ్రీకారం చుట్టారు. వేలాది మంది భక్త పారవశ్యం తో రథాన్ని లాగారు. కోలాట భజనలు, సాంస్కృతిక ప్రదర్శనలు, కీర్తనలు, కనుల పండు వగా రథయాత్ర సాగింది. రథయాత్ర సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

పంటల బీమాను నమోదు చేసుకోవాలి

ఉండ్రాజవరం, జూన్27 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద - 2025 సంవత్సరానికి రైతులు పంటల బీమాను నమోదు చేసుకోవాలని ఏవో బీ. రాజారావు తెలిపారు. అలాగే వరి, మినుము పంటలకు ఎస్‌బీఐ, జనరల్ ఇన్సూరెన్స్, అరటికి ఇఫ్కో టోక్యో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీకి చెల్లించాలని చెప్పారు. వరికి ఎకరాలకు రూ.578.92, మినుముకు రూ.303.64, అరటికి రూ.3036 చెల్లించాలన్నారు.

చెరువు కాదండీ... రైలు వంతెన!

● కింది భాగంలో నిలిచిపోతున్న వర్షపు నీరు
● ప్రయాణికులు, వాహనదారులకు తప్పని ఇక్కట్లు


కొవ్వూరు ఆర్చ్ బ్రిడ్జి అండర్ పాస్‌లో నిలిచిన వర్షపు నీరు

కొవ్వూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు- రాజమహేంద్రవరం రోడ్డులోని రైలు వంతెన కింద వర్షపునీరు నిలిచిపోవడంతో చెరువును తలపిస్తోంది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రహదారిలో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కొవ్వూరు పట్టణ, పరిసర మండలాల నుంచి ప్రతిరోజూ వేలాదిమంది పాఠశాలలు, కార్యాలయాలు, వ్యాపార, ఆసుపత్రి పనుల నిమిత్తం వెళ్తుంటారు. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు నిలిచిపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని వాహనదారులు వాపోతున్నారు. చిన్నపాటి వర్షానికే ఆర్చ్ బ్రిడ్జి అండర్‌పాస్ కింద నీరు నిలిచిపోవడంతో పెద్ద వాహనాలు వెళ్లినపుడు నీరుపైకి చిమ్మి ద్విచక్ర వాహనదారులపై పడుతున్నాయి. ఇకనైనా శాశ్వత చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. అలాగే కొవ్వూరు అగ్నిమాపక శాఖ కార్యాలయం ఎదురుగా, పట్టణ పోలీస్‌స్టేషన్, ట్రెజరీ కార్యాలయం, కోర్టు ప్రాంగణాలకు వెళ్లే రహదారిలోనూ ఇదే పరిస్థితి ఉంది. వివిధ పనుల నిమిత్తం వచ్చే కక్షిదారులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

వారాహి అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే


అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, తదితరులు

కొవ్వూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు బ్రిడ్జిపేటలో వేంచేసియున్న వారాహి అమ్మవారి ఆలయానికి భక్తులు శుక్రవారం పోటెత్తారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు పి. దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణ, పరిసర ప్రాంతాల నుంచి మహిళలు పెద్దఎత్తున తరలివచ్చారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణారావు, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, టీడీపీ పట్టణ అధ్యక్షుడు దాయన రామకృష్ణ, కె. విజయలక్ష్మి, బీజేపీ నేత బోడపాటి ముత్యాలరావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

రుడా చైర్మన్‌ను కలిసిన యువగళం నాయకులు


బీవీఆర్ చౌదరిని శాలువాతో సత్కరిస్తున్న యువగళం నాయకులు

తాళ్లపూడి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యువగళం నాయకులు శుక్రవారం రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరిని రుడా కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసినట్టు యువగళం నేత కాకర్ల సత్యేంద్ర తెలిపారు. కార్యక్రమంలో కూచిపూడి గణేష్, అనపర్తి ప్రసాదు, వల్లిపల్లి సతీష్, మండలంలోని పలు గ్రామాల యువగళం సభ్యులు తదితరులు పాల్గొన్నారని ఆయన తెలిపారు.

'న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టం తేవాలి'

కొవ్వూరు, జూన్27 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని కొవ్వూరు బార్ అసోసియేషన్ కార్యదర్శి రాజాన శ్రీనివాస్‌అన్నారు. రేపల్లెలో సీనియర్ న్యాయవాది కొంపెల్ల శ్రీనివాస్‌ను హత్య చేసిన సంఘటనపై బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం న్యాయవాదులు నిరసన తెలుపుతూ విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రీనివాస్‌ను హత్యచేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. బార్ అసోసియేషన్ న్యాయవాదులు ఎం.నాగమణి, దొండపాటి కృష్ణ, కోడూరి నరసింహారావు, బి. హరిమోహన్, వై. చలపతిరావు, జె. భరత్, తదితరులు పాల్గొన్నారు.

జనావాసాల మధ్య సెల్‌టవర్ వద్దు

● సింగరాజుపాలెం గ్రామస్థుల ఆందోళన


ఆందోళన చేస్తున్న సింగరాజుపాలెం గ్రామస్థులు

నల్లజర్ల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జనావాసాల మధ్య సెల్‌టవర్ ఏర్పాటు చేయవద్దంటూ సింగరాజుపాలెం గ్రామస్థులు శుక్రవారం ఆందోళన చేశారు. గ్రామంలోని బీసీ కాలనీ వద్ద ఓ వ్యక్తికి చెందిన స్థలంలో టవర్ ఏర్పాటు చేసేందుకు శుక్రవారం పనులు ప్రారంభించారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్థులు అక్కడకి వెళ్లి పనులు నిలుపుదల చేయాలని కోరారు. గ్రామంలో సెల్ టవర్ నిర్మించడం ద్వారా రేడియేషన్ ప్రభావంతో అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉందని వారంతా ఆరోపిస్తున్నారు. 2018లో ఇదే ప్రాంతంలో సెల్‌టవర్ నిర్మించేందుకు ప్రయత్నించగా, అప్పటి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ద్వారా నిలుపుదల చేశామని, ప్రస్తుతం మళ్లీ అదే ప్రాంతంలో నిర్మాణం చేయడం ప్రారంభించారన్నారు. పంచాయతీ అనుమతులు లేకుండా సెల్‌ట వర్‌ను కంపెనీ ప్రతినిధులు ఎలా నిర్మిస్తారని వారంతా ప్రశ్నించారు. ఆందోళనలో బోయపాటి శేషు, గద్దే శ్రీనివాస్, వామిశెట్టి వెంకటేశ్వరరావు, దొండపాటి నాని, అనపర్తి చిన్న, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణలో రాజీవద్దు : ఎమ్మెల్యే ముప్పిడి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పట్టణం లో పారిశుధ్య నిర్వహణలో రాజీపడొద్దని ఎమ్మె ల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం కొవ్వూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ బావన రత్న కుమారి అధ్యక్షతన జరిగింది. దీనికి టీడీపీ ఫ్లోర్‌లీడర్ సూరపనేనిచిన్ని హాజరై మాట్లాడుతూ విద్యుత్, మున్సిపల్ శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో తరచూ విద్యుత్ దీపాల నిర్వహణలో సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. కౌన్సిలర్ కంటమణి రమేష్‌బాబు, వైస్‌చైర్మన్ మన్నెపద్మ మాట్లాడుతూ పట్టణంలో గతనెల రోజులుగా పారిశుధ్యం నిర్వహణ అధ్వానంగా ఉందన్నారు. ఇంటింటా చెత్త సేకరణ మూడు రోజులకు ఒకసారి చేపడుతున్నారని, దీంతో ఎక్కడి చెత్త అక్కడ దర్శనమిస్తోందన్నారు. కండెల్లి రామారావు మాట్లాడుతూ ఔరంగాబాద్ నుంచి మురుగు, వర్షపునీరు పోయే కాలువలను రైతులు ఆక్రమించి అడ్డుకట్టలు వేయడంతో అది రోడ్లపై ప్రవహిస్తోందన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆక్రమణలు తొలగించడానికి రెవెన్యూ, మున్సిపల్, పోలీసుశాఖల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి సమస్యను పరిష్కరించాలన్నారు. పిల్లలమర్రి మురళీకృష్ణ మాట్లాడుతూ గౌతముడు తపసు చేసిన గోష్పాదక్షేత్రం, కొవ్వూరుకు అఖండ గోదావరి టూరిజం ప్రాజెక్టులో అన్యా యం జరుగుతోందన్నారు. కోడూరి శివరామకృష్ణ మాట్లాడుతూ గోదావరి పుష్కరాలు రాజమహేంద్రవరం కేంద్రంగా జరుగుతున్నాయని, గోదావరి పుట్టుకకు కారణమైన కొవ్వూరుకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి మాట్లాడుతూ పారిశుధ్యంపై తరచుగా ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. వర్షాకాలం కావడంతో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. కమిషనర్ టీ. నాగేంద్రకుమార్ మాట్లాడుతూ మున్సిపల్ కాంపాక్టర్‌లు రెండూ మరమ్మతులకు గురికావడంతో ఇటీవల పారిశుధ్య సమస్య తలెత్తిందని, ఒక కాంపాక్టర్లకు మరమ్మతులు చేయించినట్టయితే సమస్య పరిష్కారం అవు తుందన్నారు. ఏడీపీలో 40 కాంపాక్టర్ డస్ట్‌బిన్లు కావాలని అడగడం జరిగిందన్నారు.

● త్వరలో పుష్కరాలపై సమీక్ష

ఎమ్మెల్యే ముప్పిడి మాట్లాడుతూ త్వరలో కొవ్వూరు డివిజన్‌లో పుష్కరాలకు సంబంధించి ఎంపీ, మంత్రులతో సమీక్షా సమావేశం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రశాంతిని కోరడం జరిగిందన్నారు. కొవ్వూరు పాత రైలు వంతెనపై రాజమహేంద్రవరం వైపు చేపట్టిన అఖండ గోదావరి ప్రాజెక్టు పనులను కొవ్వూరు వరకు పొడిగించాలని కోరామన్నారు. సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ ఉద్యోగులు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ప్రజా చైతన్య కార్యక్రమం



నిడదవోలు పట్టణంలో మాట్లాడుతున్న ఎఫ్‌టీయూ నేత గ్రీష్మకుమార్

నిడదవోలు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): బీజేపీ పాలకులు ఒక వైపు బహిరంగంగా రాజ్యాంగ రద్దు ప్రకటన చేస్తూ ... మరోవైపు రాజ్యాంగ పరిరక్షణ దినోత్సవాలు జరపడం ప్రజలను మభ్య పెట్టడమేనని ఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఈమని గ్రీష్మ కుమార్ అన్నారు. శుక్రవారం నిడదవోలు పట్టణంలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఎమర్జెన్సీకి 50 ఏళ్ల పూర్తి అయిన సందర్భంగా ప్రజా చైతన్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమర్జెన్సీ కాలంలో ప్రశ్నించిన మేథావులను కాల్చి చంపారని, ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ప్రశ్నిస్తున్న వారిని నక్సలైట్ల పేరిట నిర్బంధానికి గురిచేస్తున్నారన్నారు. మరోపక్క రాజ్యాంగ విరుద్ధంగా పోలీసులు, మిలటరీ వ్యవస్థలను ఉపయోగిస్తున్నారన్నారు. ప్రజా స్వామికవాది పి.సారథి మాట్లాడుతూ గతంలో ఎమర్జెన్సీ కారణంగానే ప్రజాస్వామిక ఉద్యమాలు పెల్లుబికాయని, ఈ విషయాన్ని ప్రస్తుతం పాలకులు గుర్తించకపోతే చరిత్ర పునరావృత్తమవుతుందన్నారు.అనంతరం పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో కోనేటి మల్లేశ్వరరావు, రవ్వా సురేష్ కుమార్, యాదాల ప్రసన్న, యలగాడ రాజ్‌పాల్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోను కలిసిన నేతలు


ఎంపీడీవోను సత్కరించిన దృశ్యం

తాళ్లపూడి, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన ఎస్. వేణుగోపాలరెడ్డిని పలువురు టీడీపీ నేతలు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఇందులో నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు తిగిరిపల్లి గోపి, మండలంలోని టీడీపీ నేతలు సిద్ధా దుర్గారావు, మల్లిపూడి హనుమంతరావు, మల్లిపూడి బాపూజీరావు, కొడమంచిలి ప్రకాశం ఉన్నారు.

దేవరపల్లి మండలంలో ముమ్మరంగా వరినాట్లు


యర్నగూడెంలో నాట్లు వేస్తున్న కూలీలు

దేవరపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో వరినాట్లు ముమ్మరంగా ప్రారంభమయ్యాయి. యర్నగూడెం, త్యాజంపూడి, గౌరీపట్నం, కృష్ణంపాలెం, దుద్దుకూరులో పనులు చురుగ్గా సాగుతున్నాయి. మండల వ్యాప్తంగా ఎనిమిది వేల ఎకరాల్లో వరిని సాగు చేస్తున్నారు. అయితే ఈ నాట్లు వేయడానికి రైతులంతా బెంగాల్ నుంచి వచ్చిన కూలీలను ఆశ్రయిస్తున్నారు. మన రాష్ట్రానికి చెందినవారు ఎవరూ రావడం లేదు.

విద్యార్థి అదృశ్యంపై కేసు

కొవ్వూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ పి. విశ్వం తెలిపారు. ఇందిరమ్మకాలనీకి చెందిన కోరాడ ధర్మతేజ రాజమహేంద్రవరంలో ఇంటర్ చదువుతున్నాడు. ఈనెల 26వ తేదీన రోజు మాదిరిగానే కళాశాల బస్సులో కాలేజీకి వెళ్లి తిరిగి సాయంత్రం ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణం వద్ద దిగాడు. అప్పటి నుంచి ఇంటికి తిరిగి రాకపోవడంతో తండ్రి కోరాడ ప్రకాష్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై ఏఎస్ఐ కేసు నమోదు చేశారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన


పట్టణంలో అవగాహన కల్పిస్తున్న బీజేపీ నేతలు

నిడదవోలు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పాలనలో దేశం సాంకేతిక యుగంగా మారిందని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం నిడదవోలులో కేంద్రప్రభుత్వ పథకాలపై ఇంటింటా కరపత్రాలను పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం దేశ ప్రజల రక్షణ, సంక్షేమమే ధ్యేయంగా మంచి పరిపాలన సాగిస్తోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు నీలం రామారావు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

షర్మిలకు వినతిపత్రం అందజేత


వినతిపత్రం అందజేస్తున్న రైల్వే పరిరక్షణ సమితి సభ్యులు

కొవ్వూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో 2019 నాటి రైళ్లకు తిరిగి హాల్టింగ్ పునరుద్ధరించాలని కొవ్వూరు రైల్వే పరిరక్షణ సమితి సభ్యులంతా కలిసి శుక్రవారం పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డికి వినతిపత్రం అందజేశారు. రాజమహేంద్రవరం విచ్చేసిన ఆమెను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోవిడ్ సమయంలో రైళ్లను రద్దు చేయడంతో సుమారు 110 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో రైల్వేపరిరక్షణ సమితి సభ్యులు హబీబు జగన్నాథరావు, గారపాటి మోహనరావు, విల్సన్‌రాజు, వైకే శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు సాకా పుల్లారావు, బచ్చు బుచ్చిబాబు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవాలి

● 9వ అదనపు జిల్లా జడ్జి ఎం. అనురాధ


సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి అనురాధ

కొవ్వూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌లో ఇన్సూరెన్సు కేసులను ఎక్కువ సంఖ్యలో రాజీ చేసుకోవాలని కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి ఎం. అనురాధ అన్నారు. శుక్రవారం ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు, ఇన్సూరెన్సు కేసులు చూసే న్యాయవాదులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూలై 5వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా కక్షిదారులకు సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. కార్యక్రమంలో ఇన్సూరెన్సు కంపెనీ న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడిగా శ్రీనివాస్

కొవ్వూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడిగా చింతల శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఈయన ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు పనిచేసిన పి.చంద్రశేఖర్ రాజమహేంద్రవరం జిల్లా వ్యవసాయ సంచాలక కార్యాలయానికి బదిలీ అయ్యారు. దీంతో భీమవరంలో వ్యవసాయ సహాయసంచాలకుడిగా పని చేస్తున్న శ్రీనివాస్ వచ్చారు. ఏవో ఏ. గంగాధర్, కార్యాలయ సిబ్బంది, డివిజన్ పరిధిలోని ఏవోలు మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు.

నల్లజర్ల గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా దుర్గారావు


నూతనంగా ఎన్నికైన దుర్గారావును అభినందిస్తున్న రాజారావు

నల్లజర్ల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): నల్లజర్ల గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా బేతిన దుర్గారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు సొసైటీ మాజీ అధ్యక్షుడు అల్లాడ రాజారావు పేర్కొన్నారు. శుక్రవారం నల్లజర్లలో పార్టీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దుర్గారావును ఎన్నుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, జడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజును దుర్గారావు కలిశారు. నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ నాకు ఈ అవకాశం కల్పించిన ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, జడ్పీ మాజీ చైర్మన్‌కి కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ముళ్లపూడి కృష్ణమూర్తి, పార్టీ నాయకులు, కార్య కర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సూరయ్యపేట ప్రభుత్వ కాలనీలో ఎంపీడీవో పర్యటన


కాలనీలో ప్రజల సమస్యలు వింటున్న ఎంపీడీవో వేణుగోపాలరెడ్డి, ఇతర అధికారులు

తాళ్లపూడి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): అన్నదేవరపేట పంచాయతీ పరిధి సూరయ్యపేట ప్రభుత్వ కాలనీలో ఇళ్ల నిర్మాణాలు, మౌలిక సదుపాయాల కల్పనపై శుక్రవారం ఎంపీడీవో వేణుగోపాలరెడ్డి పలు శాఖల అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో గృహ నిర్మాణాలు వేగవంతం చేసే విధంగా ఇక్కడ నివాసముంటున్న ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. మండలంలోని వివిధ గ్రామాల లబ్ధిదారులు 945 మందికి స్థలాలు కేటాయించగా, వారిలో 200 మంది పూర్తిస్థాయిలోనూ 73 మంది లింటెల్ లెవెల్‌లోనూ, 41 మంది రూఫ్ లెవెల్‌లోనూ, 47 మంది బేస్మెంట్ లెవెల్‌లో ఇళ్ల నిర్మాణాలు ఉన్నాయన్నారు. దీనిపై మండల స్థాయి అధికారుతో సమావేశాన్ని ఏర్పాటు చేసిన తర్వాత ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు దృష్టికి సమస్యను తీసుకువెళతానని ఎంపీడీవో చెప్పారు. ఈయనతోపాటు అధికారులు ఉన్నారు.